Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 109 మేడ్చల్ మల్కాజ్‌గిరి 11 మే 2023 గురువారం పేజీలు : 4

## దేశంలోని కొన్ని ప్రాంతాల్లో 61 వేలు దాటేసిన బంగారం..

ప్రతి రోజూ దేశంలో బంగారం, వెండి ధరల్లో హెచ్చు తగ్గులు సర్వసాధారణంగానే చోటు చేసుకుంటూ ఉంటాయి. అయితే గత రెండు రోజులుగా మాత్రం అంతో ఇంతో తగ్గి ఊరటనిచ్చిన బంగారం నేడు మాత్రం కొనుగోలుదారులకు బిగ్ షాకే ఇచ్చింది. నేడు మళ్లీ బంగారం ధర పెరిగింది. ఆ పెరగడమనేది అసలు పరిగణలోకి తీసుకోలేనంత అయినప్పటికీ ఒకసారి పెరగడమనేది ఆరంభిస్తే.. అది కంటిన్యూ అవుతుంది. ఇప్పటికే బంగారం ధర మరింత పెరగవచ్చంటూ నిపుణులు చెప్పిన విషయం తెలిం౯సిందే. నేడు కొన్ని ప్రాంతాల్లో బంగారం ధర రూ. 61 వేలను దాటేసింది. నేడు దేశంలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు)పై రూ. 10 పెరిగి.. రూ. 55,310కి చేరుకుంది. ఇక 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు)పై రూ. 19 పెరిగి రూ. 69,340కి చేరుకుంది.

# బండి సంజయ్ ఔట్.. ఈటల ఇన్!



## పార్టీ పగ్గాలు రాజేంద్రుడికేనా..!?

హైదరాబాద్ : తెలంగాణ బీజేపీ రాజకీయం కీలక మలుపు తిరగనుందా? పార్టీ చీఫ్ను మార్చేసే పనిలో బీజేపీ అధిష్టానం దృష్టి సారించిందా? వాయు వేగ మనోవేగాలతో తెలంగాణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్ణయించిందా? అంటే.. తాజాగా జరుగుతున్న రాజకీయ పరిణామాలను బట్టి ఔననే అంటున్నారు పరిశీలకులు. తాజాగా బీజేపీ కీలక నాయకుడు హుజూరాబాద్ నుంచి బైపోల్లో గెలిచిన ఈటల రాజేందర్ కేంద్ర హోం మంత్రి అమిత్షాను కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో చర్చించిన అమిత్ షా.. కీలక పదవికి సిఫారసు చేస్తానని చెప్పినట్టు వార్తలు వస్తున్నాయి. కీలక పదవి అంటే.. బీజేపీ చీఫ్ మినహా మరొకటి లేదని.. తెరమీదికి వస్తున్న చర్చ. అంటే.. ప్రస్తుత తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ను పక్కన పెట్టి.. ఆయన స్థానంలో ఈటలకు అవకాశం కల్పిస్తారనేది రాజకీయ విశ్లేషకుల అంచనా. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో పాగా వేయాలని.. బీజేపీ ధ్రుఢంగా నిర్ణయించుకుంది. ఇప్పటికేదీనికి సంబంధించి పార్టీ అధిష్టానం కూడా కీలకంగా దృష్టి సారించింది. ఈ



క్రమంలో బలమైన కేసీఆర్ను ఢీ కొట్టాలంటే.. ఆయన ఆనుపానులు తెలిసిన నాయకుడు పార్టీకి అత్యంత అవసరం. బండి సంజయ్ కొంత మేరకు కేసీఆర్ను ఢీ అంటే ఢీ అని దూకుడు ప్రదర్శిస్తున్నా.. ఆశించిన మేరకు ఫలితం రాబట్టలేక పోతున్నారు. సాగర్ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయింది. హైదరాబాద్ నగర పాలక సంస్థ ఎన్నికల్లోనూ ఆశించిన విధంగా ప్రయోజనం కనిపించ లేదు. దీనికితోడు ఎన్నికలు వస్తున్నా..

### అధికారమే లక్ష్యంగా బిజెపి వ్యూహాలు

పార్టీలో కొత్తగా చేరే నాయకులు కూడా కనిపించడం లేదు. టీఆర్ ఎస్పై ఆగ్రహంతో ఉన్న సొంత పార్టీ నాయకులు కూడా బీజేపీలో చేరడం లేదు. దీంతో బండి సంజయ్ ప్రయత్నాలు సఫలం కావడం లేదనే భావన పార్టీ అధిష్టానంలో ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బీసీ నాయకుడిగా .. బలమైన గళం వినిపించే నేతగా ఉన్న ఈటలకు పగ్గాలు అప్పగిస్తే.. పార్టీ మరింత దూకుడుగా ముందుకు సాగే అవకాశం ఉంటుందని అధిష్టానం భావిస్తోందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీలో నాయకుల కన్నా.. అధికారానికి దూకుడుకు ప్రాధాన్యం ఇచ్చే బీజేపీ.. కేంద్రంలోనూ నరంద్ర మోడీ హవాను వినియోగిం చుకుంటున్న విషయం తెలిసిందే. గతంలో అనేక మంది నాయకులు ఉన్నప్పటికీ.. మోడీ ప్రభంజనం పనిచేయడంతో ఆయననే కీలకంగా భావిస్తోంది. ఇలానే.. తెలంగాణలోనూ.. ఈటలతో ప్రయోజనం ఉంటుందని అధిష్టానం భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో బండిని పక్కన పెట్టి.. ఈటలకు రాష్ట్రపగ్గాలు అప్పగించే అవకాశం ఉందని తెలుస్తోంది. పైగా కేసీఆర్ ఆనుపానులు తెలిసిన నాయకుడిగా టీఆర్ ఎస్లోని వందల మంది నాయకులతో ఉన్న పరిచయాలు వంటివి.. ఈటలకు కలిసి వస్తాయని.. బీజేపీ అధిష్టానం భావిస్తోంది. ఈ క్రమంలోనే బండిని పక్కన పెట్టి.. ఈటలకు పగ్గాలు అప్పగించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.. మరి ఏం జరుగుతుందో చూడాలి.




తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి కరీంనగర్‌లోని మహిళా జైలును సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు.

## ఏపీ - తెలంగాణ ఎన్నికలకు ఈసీ సమాయత్తం



### కీలక ప్రకటన..!!

తెలుగు రాష్ట్రాలకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. ఈ రెండు రాష్ట్రాల్లో ఇప్పటికే ఎన్నికల వాతావరణం మొదలైంది. తెలంగాణలో అసెంబ్లీ గడువు 2024 జవనరి 16తో ముగియనుంది. ఏపీ అసెంబ్లీ గడువు 2024 జూన్ 11తో ముగియనుంది. దీంతో..ఈ రెండు రాష్ట్రాలతో పాటుగా ఈ ఏడాది ఎన్నికలు జరగాల్సిన మొత్తం తొమ్మిది రాష్ట్రాలకు సంబంధించి ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా తాజాగా కీలక ప్రకటన విడుదల చేసింది. ఉమ్మడి గుర్తు కోసం:ఏపీ, తెలంగాణతో సహా తొమ్మిది రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు తొలి అడుగు పడింది. ఎన్నికలు జరగాల్సిన రాష్ట్రాల్లో ఉమ్మడి ఎన్నికల గుర్తుల కోసం పార్టీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఎన్నికల సంఘం ప్రకటన విడుదల చేసింది. ఎలక్షన్ సింబల్స్ (రిజర్వేషన్ అండ్ ఎలాట్ మెంట్) ఆర్డర్ 1968లోని పేరా 10-బిని అనుసరించి 2023-24 సంవత్సరాల్లో జరిగే ఎన్నికల్లో పోటీ చేసే పార్టీలు ఉమ్మడి గుర్తుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే పార్టీల జూలై 17, ఏపీఅసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే పార్టీలు డిసెంబర్ 12 తరువాత దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్నికల సంఘం పేర్కొంది. లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసే పార్టీలు డిసెంబర్ 17 తరువాత దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్నికల సంఘం సూచించింది. రానున్న ఏడాది కాలంలో తెలంగాణ, మిజోరం, చత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్, రాజస్థాన్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ, ఒడిశా అసెంబ్లీ ఎన్నికలతో పాటుగా లోక్ సభకు ఎన్నికలు జరగనున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటుగా పార్లమెంట్ కు జూన్ 12, 2024తో గడువు ముగియనుంది. ఒక వేళ ఏదైనా అసెంబ్లీ గడువు మ్నుందుగానే రద్ద అయితే, ఆ రోజు నుంచి నోటిఫికేషన్ జారీ చేసి అయిదు రోజుల ముందు వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్నికల సంఘం పేర్కొంది. దీని ద్వారా ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో కామన్ సింబల్ కోసం రెండు ముఖ్యమైన పార్టీలు ముందుకొచ్చే అవకాశం కనిపిస్తోంది. ఎలక్షన్ హీట్:ఏపీలో ఈ సారి ఎన్నికలు హోరా హోరీగా సాగనున్నాయి. అధికారం తిరిగి నిలబెట్టుకోవటం కోసం వైసీపీ.. ఎలాగైనా అధికారంలోకి రావాలని టీడీపీ భావిస్తున్నాయి. ఇదే సమయంలో టీడీపీ, జనసేన పొత్తు ఖాయంగా కనిపిస్తోంది. బీజేపీ ఈ రెండు పార్టీలతో జత కడుతుందా లేదా అనేది స్పష్టత రావాల్సి ఉంది. తెలంగాణలోనూ రాజకీయంగా కీలక సమీకరణాలు చోటు చేసుకుంటున్నాయి. బీఆర్ఎస్ మూడో సారి గెలిచి హ్యాట్రిక్ సాధించాలని ప్రయత్నిస్తోంది. అధికారం దక్కించుకుంటామని బీజేపీ ధీమా వ్యక్తం చేస్తోంది. పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఈ సమయంలో ఎన్నికల సంఘం ఎన్నికలకు కసరత్తు ప్రారంభించటంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయంగా మరింత వేడెక్కె అవకాశం కనిపిస్తోంది.

## కేసీఆర్‌ను తెలంగాణకే పరిమితం చేసేలా

# బిజెపి భారీ ప్లాన్




### సార్వత్రిక ఎన్నికలతో పాటే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు...!?

హైదరాబాద్ : తెలంగాణ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయని ప్రశ్నిస్తే అందరూ చెప్పే సమాధానం 'డిసెంబర్' అని.. కానీ ఈసారి కేంద్రంలోని బీజేపీ పెద్ద ప్లాన్ చేస్తోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కేసీఆర్ ను తెలంగాణకే పరిమితం చేయాలంటే.. రాష్ట్రం దాటకుండా జాతీయ రాజకీయాల్లోకి రానీయకూడదంటే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం జరపకూడదంటూ బీజేపీ స్కెచ్ గీసినట్టు సమాచారం. ఈ క్రమంలోనే 2024లో మేలో జరిగే సార్వత్రిక ఎన్నికలతోపాటే తెలంగాణ సహా 5 రాష్ట్రాల ఎన్నికల ను జరపాలని కేంద్రంలోని బీజేపీ ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం ఈ రాష్ట్రాల కాలపరిమితి ముగియగానే రాష్ట్రపతి పాలన విధించి మే నెలకు పోస్ట్ పోన్ చేయాలని చూస్తున్నాయి. పార్లమెంట్ తోపాటు తెలంగాణ ఎన్నికలు జరిగితే కేసీఆర్ రాష్ట్రానికే పరిమితం అవుతాడని.. ఆయనను జాతీయ రాజకీయాల్లోకి రాకుండా నిరోధించవచ్చన్న ప్లాన్ ను బీజేపీ చేస్తున్నట్టు సమాచారం. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఇప్పటికే జమిలీ ఎన్నికల కోసం విశ్వప్రయత్నాలు చేస్తోంది. పార్లమెంట్ లో ప్రత్యేక చట్టం చేసి దేశంలో అన్ని రాష్ట్రాల అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడానికి ప్లాన్ చేస్తున్నాయి. సాధ్యాసాధ్యాల పై కసరత్తు చేస్తున్నాయి. బలమైన పోటీదారులు అయిన మమతా బెనర్జీ కేసీఆర్ కేజ్రీవాల్ లాంటి వారిని ఒంటరిగా వెళితే ఎదుర్కోలేమని.. సార్వత్రిక ఎన్నికలతోపాటే కొట్టాలని బీజేపీ భావిస్తోంది. బీజేపీకి అసెంబ్లీకి పార్లమెంట్ కు ఒకటే ఓటు పడడం ఖాయమని.. ఇలా చేస్తే రాష్ట్రాల్లోనూ అధికారం దక్కుతుందన్న ఆశ బీజేపీకి ఉంది. అందుకే ఈసారి డిసెంబర్ లో తెలంగాణ ఎన్నికల కాలపరిమితి ముగియగానే ఎన్నికలకు వెళ్లకుండా రాష్ట్రపతి పాలన విధించి తెలంగాణలో పరిస్థితులన్నీ చక్కదిద్దాక మేలో సార్వత్రిక ఎన్నికలతో కలిపి ఎలక్షన్ నిర్వహించాలని బీజేపీ ప్లాన్ చేస్తోంది. అలా అయితే కేసీఆర్ ను దెబ్బకొట్టడంతోపాటు బీజేపీకి అధికారం రాష్ట్రంలో దక్కుతుందని చూస్తోంది.

## సంపాదకీయం

### పేరుకే బీజేపీ.. పార్టీ మొత్తం నరేంద్ర మయం!

జాతీయ పార్టీ అంటే... ఆ పార్టీకి కొన్ని సిద్ధాంతాలు.. వ్యవహారం.. పరిస్థితి ఉంటాయి. ప్రాంతీయ పార్టీల కంటే.. కూడా జాతీయ పార్టీలకు కొన్ని నిబద్ధతలు నిబంధనలు.. నైతికత ఉంటాయని పేరుకూడా ఉంది. అందుకే కేంద్రంలో ఏర్పాటు చేసే ప్రభుత్వంపై ప్రగాఢ విశ్వాసం కూడా ప్రజలకు ఉంటుంది. కాంగ్రెస్ విషయాన్ని తీసుకుంటే.. కుటుంబ రాజకీయాలు చేసిందని రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులను మార్చిందని.. ఇలా.. అనేక ఆరోపణలు వున్నాయి. ఫలితంగా దేశాన్ని అతి ఎక్కువ కాలం పాలించిన కాంగ్రెస్ అతి తక్కువ కాలంలో దుంపనాశనం దిశగా అడుగులు వేసింది. ఇక ఇప్పుడు బీజేపీని చూస్తే.. కుటుంబ పార్టీ కాదని.. దీనికి కొన్ని సిద్ధాంతాలు ఉన్నాయని చెప్పుకొనే ఈ పార్టీ ఇప్పుడు ఏక నాయకుడి ఏలుబడిలో సిద్ధాంత దైన్యాన్ని ఎదుర్కొంటోందని.. అంటున్నారు పరిశీలకులు. ఒకప్పుడు.. వాజపేయి.. హయాంలో వ్యక్తి కాదు... పార్టీ ముఖ్యం. పార్టీకి సిద్ధాంతం ముఖ్యమంటూ.. పార్లమెంటు వేదికగానే ఆయన ప్రవచించి.. దానికి కట్టుబడ్డారు. కానీ ఇప్పుడు మోదీ ఏలుబడిలో బీజేపీ అంటే.. మోదీ.. మోదీ అంటే బీజేపీ తప్ప.. మరో మాటే వినిపించడం లేదు. ఇది ఒకరకంగా కుటుంబ పార్టీల ఆధిపత్యం కన్నా ఎక్కువేనని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పుడు ఎటు చూసినా.. ఎక్కడ విన్నా.. 'నమో నరేంద్ర' మాటే వినిపిస్తోంది. కట్టకట్టుకుని బీజేపీ నాయకులు మొత్తం.. నరేంద్ర మోడీని ఆకాశానికి ఎత్తేస్తున్నారు. ఆయనను హైలెట్ చేస్తున్నారు. ఆయన నామస్మరణలో మునిగితేలుతున్నారు. ఇక రాష్ట్రాల్లోనూ.. బీజేపీ పాలిత ప్రభుత్వాలు ఉన్న చోట.. మోడీతో మార్కులు వేయించుకున్న వారే.. ముఖ్యమంత్రులు.. మంత్రులు అవుతున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది. ఈ పరిణామం.. ఇప్పటికైతే.. బాగానే ఉన్నా.. మోడీ తర్వాత.. ఎవరు..? అని చూసుకుంటే..పార్టీ కనిపించాల్సిన స్థానంలో వ్యక్తులు కనిపించడం.. పార్టీపై పైచేయి సాధించాలనే ప్రత్యర్థి పార్టీలు పోయి.. మోడీని ఓడిస్తే చాలనే దిశగా అడుగులు వేయడం ద్వారా.. చివరకు సాధించేది.. ఏంటి? అంటే.. బీజేపీని భూస్థాపితం చేసుకోవడమే భావన వ్యక్తం చేస్తున్నారువిశ్లేషకులు. అంతిమంగా ఇలాంటి పోకడలు దేశానికి జాతికి కూడా ప్రయోజనం చేకూర్చే అవకాశం లేదని చెబుతున్నారు. కుటుంబ పార్టీ లకన్నా.. ఏకవ్యక్తి ఆధిపత్యం మరింత ప్రమాదకరమని అంటున్నారు.

# అటవీ X రెవెన్యూ



మహబూబాబాద్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూవివాదాలు కొనసాగుతున్నాయి. ఏళ్లుగా కొలిక్కిరావడం లేదు. ఇలాంటి వాటికి గతంలో రెవెన్యూ అధికారులు పట్టాలు అందజేశారు. భూప్రక్షాళన సమయంలో పాత పట్టాల స్థానంలో కొత్తవి జారీకి ముందే ఇరుశాఖల మధ్య సరిహద్దు వివాదం తలెత్తింది. ఇది గుర్తించిన సర్కారు సర్వే చేపట్టాలని 2018–19లో నిర్ణయించింది. కానీ పూర్తిస్థాయిలో జరగలేదు. దీంతో మావంటే మావి అని ఇరు శాఖలు అంటున్నాయి. తాజాగా భూపాలపల్లి జిల్లాలో రెవెన్యూ అధికారులపై అటవీ శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు.

జయశంకర్ జిల్లా మహాముత్తారం శివారులోని అటవీ–రెవెన్యూ శాఖల మధ్య ఉన్న వివాదాస్పద భూములు. 487 సర్వే నెంబరులోని భూమిలో రైతులు బోరుబావులు తవ్వుతుండగా.. అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకుని తహసీల్దార్ మాధవి, డిప్యూటీ తహసీల్దార్ సందీప్ వెళ్లి అవి రెవెన్యూ భూములని, రైతులకు పట్టాలిచ్చామని, బోరుబావుల తవ్వకానికి అనుమతులు ఇచ్చామని చెప్పారు. ఆ భూములు తమవని అటవీ అధికారులు అభ్యంతరం చెప్పారు. అక్రమంగా బోరుబావుల తవ్వకానికి సహకరిస్తున్నారని తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌పై ఏకంగా కేసు నమోదు చేసి కోర్టుకు సమర్పించారు.

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం పెద్దవెంకటాపురంలోని 33 సర్వే నంబర్‌లో గల 80 ఎకరాలు వివాదంలో ఉన్నాయి. రెండు శాఖలు తరచూ తమ భూములని చెబుతున్నాయి. ఇంత వరకు సర్వే చేయలేదు. చిన్నబోయినపల్లిలోని ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 98లో 818 ఎకరాలూ వివాదంలో ఉన్నాయి. ఏటూరునాగారం పంచాయతీ మానసపల్లి శివారు 11/1 సర్వే నెంబర్‌లోని 470 ఎకరాలను మావంటే మావని అటవీ, రెవెన్యూ అధికారులు అంటున్నారు.

48,843.72 ఎకరాలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 48,843.72 ఎకరాలు వివాదంలో ఉన్నాయి. ఆ శాఖల మధ్య సమన్వయం లోపం రైతుల పాలిట శాపంగా మారింది. ఇరు శాఖలు సంయుక్త సర్వే సకాలంలో పూర్తి చేయకపోవడంతో వేలాది మంది అన్నదాతలు సర్కారు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం పరిధిలో 16 వేల ఎకరాల్లో రెవెన్యూ, అటవీశాఖ సరిహద్దు భూములున్నాయి. కరోనాకు ముందు సంయుక్త సర్వే చేసి 4 వేల ఎకరాలు రెవెన్యూవిగా గుర్తించారు. వాటికి ఇంకా పట్టాపుస్తకాలు జారీ చేయలేదు. మిగిలిన 12 వేల ఎకారల్లో సర్వే చేయలేదు.

రికార్డులు సరిపోలక

రెవెన్యూ అధికారులు పాత రికార్డుల ప్రకారం సర్వే నంబర్ల ఆధారంగా గుర్తిస్తున్నారు. అటవీశాఖ కంపార్టుమెంట్లు, కోఆర్డినేట్లు అంటూ కొలతలను ప్రమాణికంగా తీసుకొంటుంది. ఒకదానికొక్కటి సరిపోలడం లేదని తెలిసింది. సంయుక్త సర్వేకు వెళ్లిన చోట కొలవడం ఎటువైపు నుంచి మొదలు పెట్టాలనే దానిపై ఇరుశాఖల మధ్య తేడాలు వస్తున్నాయి. ఇందుకు రికార్డుల్లోని లోపాలు సమస్యగా మారింది.

రైతుల అవస్థలు

కరోనాకు ముందు సమన్వయంతో సర్వే చేశారు. కొవిడ్–19 తర్వాత జాప్యం చేస్తున్నారు. వీరి నిర్లక్ష్యం వల్ల రైతులు అవస్థలు పడుతున్నారు. పట్టాలు లేక రైతుబంధు, బీమా, పంట రుణాలకు దూరమవుతున్నారు. గిరిజనులు గిరి వికాస్ పథకానికి అనర్హులుగా మారుతున్నారు. అటవీశాఖ అధికారులు సాగు చేయనివ్వకుండా అడ్డుకుంటున్నారు. ఇప్పటికైనా సర్వే చేస్తే వేల ఎకరాల భూముల సమస్య పరిష్కారమై, అర్హులైన రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందుతాయి.

పట్టాపుస్తకం కోసం ఎదురుచూస్తున్నా

–బానోతు హుస్సేన్, కస్తూరినగర్, బయ్యారం

కస్తూరినగర్‌లో 6 ఎకరాలు ఉంది. అది పారెస్టు భూమి అంటూ అధికారులు సాగు పనులను అడ్డుకుంటున్నారు. గతంలో రెవెన్యూ, అటవీ అధికారులు సర్వే చేశారు. అప్పుడు రెవెన్యూ భూమి అని తేల్చారు. కానీ పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వలేదు. మళ్లీ అటవీ శాఖ ఇబ్బందులు పెడుతోంది.సర్వే చేశాం

ఎం.డెవిడ్, మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్

జిల్లాలో రెవెన్యూ, అటవీ శాఖల మధ్య భూవివాదాలు ఉన్నాయి. వాటిపై గతంలోనే సర్వే చేశాం. ఇంకొన్ని చోట్ల చేయాల్సి ఉంది.

# రూ.17 కోట్లతో గేట్ల మరమ్మతులు



బోధన్ :ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాంసాగర్ ఆర్‌సీ గేట్లతో పాటు వరదకాల్వ, కాకతీయ కాల్వ గేట్ల మరమ్మతులకు ప్రభుత్వం రూ.17 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు శుక్రవారం పనులు ప్రారంభమయ్యాయి. తొమ్మిది నెలల కాలంలో పూర్తిచేయాల్సి ఉంది. ప్రాజెక్టు ఎస్‌ఈ శ్రీనివాస్, ఈఈ చక్రపాణి, డిప్యూటీ ఈఈ సుకుమార్, ఏఈ వంశీ పర్యవేక్షించారు.

గతేడాది ఇబ్బంది..జలాశయంలో పూర్తి స్థాయి నీటి మట్టం 1091 అడుగులు. పూర్తిగా నిండి ఇంకా ఎగువ నుంచి వరద వస్తే గోదావరి నదిలోకి మిగులు జలాలను విడుదల చేయడానికి 42 వరద గేట్లు(ఆర్‌సీ) ఉన్నాయి. అన్నింటి ద్వారా కలిపి ఒకేసారి 16 లక్షల క్యూసెక్కులను విడుదల చేసే సామర్థ్య ఉన్నా.. ఇప్పటి వరకు అత్యధికంగా ఏడు – ఎనిమిది లక్షల క్యూసెక్కుల లోపే వదిలారు. ఒక్కోటి 50 అడుగుల వెడల్పు, 33 అడుగుల ఎత్తుతో 38 వేల క్యూసెక్కులు వదిలే సామర్థ్యంతో ఉన్నాయి. గత కొన్నేళ్లుగా వీటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు జరగలేదు. ప్రధానంగా రోప్స్ పాతవి కావడంతో గతేడాది వానాకాలం వరదల సమయంలో ఆరింటిని ఎత్తకుండా 36 గేట్ల ద్వారానే విడుదల చేశారు. ఈసారి ఆ పరిస్థితి ఎదురుకాకుండా మరమ్మతులు చేపడుతున్నారు.

చేపట్టేవి ఇవే..లి ప్రధానంగా చాలా ఆర్‌సీ గేట్లకు రోప్స్ చెడిపోయాయి. ఈ నేపథ్యంలో అన్నింటికి కొత్తవి అమర్చనున్నారు. ఒక్కో గేటుకు ఎనిమిది రోప్స్ ఉంటాయి. రబ్బర్ సీల్స్ ఎగిరిపోతే నీటి లీకేజీ తలెత్తే అవకాశం ఉన్నందున పాతవాటి స్థానంలో కొత్తవి బిగించనున్నారు. అలైన్‌మెంటు చేయనున్నారు. స్టాప్‌లాక్ గేట్లకు మరమ్మతులు చేపట్టి అన్నింటికి రంగులు వేస్తారు.

లి ఇది వరకే 2, 10, 22, 35, 36, 37 నంబర్ల ఆర్‌సీ గేట్లకు మరమ్మతులు చేశారు. మిగతా ముప్పయారింటికి ప్రస్తుతం చేపడతారు.

లి ప్రాజెక్టు నుంచి కాకతీయ కాల్వ ద్వారా నీటిని విడుదల చేయడానికి హెడ్‌రెగ్యులేటర్‌లో నాలుగు గేట్లు ఉన్నాయి. ఇందులో 1, 2 నంబర్ల వాటికి ఇది వరకే మరమ్మతులు చేశారు. ప్రస్తుతం 3, 4 గేట్లకు చేయనున్నారు.ముప్కాల్ వద్ద వరద కాల్వ హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటిని విడుదల చేయడానికి ఎనిమిది గేట్లు ఉన్నాయి. వీటికీ మరమ్మతులు చేపట్టనున్నారు.

గేజ్ రూం నుంచే తెరవచ్చురాష్ట్రంలో పెద్ద ప్రాజెక్టులో ఒక్కటైన శ్రీరాంసాగర్ నుంచి మిగులు జలాల విడుదలకు ఏర్పాటు చేసిన ఆర్‌సీ గేట్లను ఎత్తడానికి ఆటోమేటిక్ సిస్టం లేదు. ఒక్కోటి తెరవాల్సిన పరిస్థితి. ఆటోమెటిక్‌గా ఎత్తడానికి స్కాడ సిస్టం ఏర్పాటు చేస్తే గేజ్ రూం నుంచే అన్నింటిని ఒకేసారి తెరవచ్చు, మూయొచ్చు. ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# పల్లెప్రగతి పనులు వేగవంతం



కామారెడ్డి : పల్లెప్రగతిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా పాలనాధికారి జితేష్ వి పాటిల్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. సీహెచ్‌సీలో 103 మంది మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వైద్యుల పనితీరు పరిశీలించారు. రోగులకు సజావుగా వసతులు కల్పించాలని సూచించారు. ఆసుపత్రి ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన యోగా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం గురుకులం పాఠశాలలో పల్లెప్రగతిలో భాగంగా అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న క్రీడా ప్రాంగణాన్ని సందర్శించి తహసీల్దార్ గోవర్ధన్‌కు సూచనలు చేశారు. ఎంపీపీ రాధ, జడ్పీటీసీ సభ్యుడు శంకర్, సర్పంచి సంజీవ్, ఉప సర్పంచి రమేష్, ఎంపీడీవో సతీష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు పత్తి శ్రీను, కార్యదర్శి నాగరాజు ఉన్నారు.

# మొక్కలు పెంచి... ఆహ్లాదం పంచి

కామారెడ్డి : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న హరితహారాన్ని జిల్లాలోని పురపాలికల్లో విజయవంతం చేసే దిశగా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. వివిధ శాఖల సమన్వయంతో ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఉద్యానాల అభివృద్ధితో పాటు ఆహ్లాదం పంచే దిశగా అడుగులు వేస్తున్నారు. గతేడాది 4.50 లక్షల కంటే మూడు లక్షలు మొక్కలు అదనంగా నాటాలని నిర్దేశించారు.

కనిపించని పచ్చదనం

జిల్లాలోని పురపాలికల్లో ఆశించిన మేర పచ్చదనం లేదు. ఉద్యానాల నిర్వహణ అంతంతమాత్రమే. జనాభాకు అనుగుణంగా మొక్కలు పెంచాల్సి ఉన్నా చర్యలు లేవు. అంతర్గత వార్డుల్లో చిన్నతరహా ఉద్యానాల ఏర్పాటు కలగానే మిగిలింది. ఇంజినీరింగ్ విభాగం అంచనాలు రూపొందించడం తప్ప క్షేత్రస్థాయిలో అమలు లేదు. పట్టణ ప్రణాళిక విభాగం సిఫారసు చేసిన ప్రాంతాల్లో ఉద్యానాల ఏర్పాటు,



నిర్వహణ కొరవడింది. ఈ సమస్యలను అధిగమించడానికి ఈసారి వార్డుల్లో విస్తృతంగా పనులు చేపట్టనున్నారు. రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటనున్నారు. హరిత ప్రణాళికతో జిల్లాకేంద్రంలో పచ్చదనం పెంపొందించేందుకు సిబ్బంది కృషి చేయాలని పురపాలక కమిషనర్లు పలుమార్లు సమావేశాలు నిర్వహించారు.

శివారు ప్రాంతాల్లో..ఈసారి శివారు ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని నిర్ణయించారు. జిల్లాకేంద్రానికి నలువైపులా 5 కి.మీ. పరిధిలో పెంచేందుకు చర్యలు చేపట్టనున్నారు. వాటిని సంరక్షించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించనున్నారు. రోడ్డు డివైడర్ల మధ్య నాటి కంచె ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే పురపాలికల్లో ఉన్న నర్సరీలను జిల్లా అధికారులు సందర్శించి సిబ్బందికి మార్గదర్శనం చేశారు.

జిల్లాకేంద్రంలో ఉద్యానాల పరిస్థితి రూ.40 లక్షలతో నిర్మించిన రాజీవ్ ఉద్యానం సమస్యలతో రాజీపడాల్సి వస్తోంది. చెంతనే కాలుష్య కారక కేంద్రాలున్నాయి.

విద్యానగర్ పురపాలక ఉద్యానం నిర్వహణ మెరుగుపరచడానికి రూ.18 లక్షల నిధులు కేటాయించారు. ఇందు కోసం పలుమార్లు కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అధికారులను కలిసి విన్నవించారు.

స్నేహపురికాలనీలో గత పాలకవర్గ హయాంలో కొత్త వనం కోసం చేసిన తీర్మానం ఆరేళ్లకు ఫలించింది. రూ.12 లక్షలతో చర్యలు చేపట్టారు.

బల్దియా కార్యాలయం వెనుక భాగాన ఉన్న ఉద్యానం నిర్వహణ అధ్వానంగా ఉంది. ఆయా ప్రాంతాల్లో ఉద్యానాల ఏర్పాటుకు స్థలాలు వదిలినా చర్యలు కరవయ్యాయి. రక్షణ చర్యలపై యంత్రాంగం ఉదాసీన వైఖరి కనిపిస్తోంది.

ప్రణాళికలు రూపొందించాం– దేవేందర్, కమిషనర్

జిల్లా కేంద్రంలో హరితహారం కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించాం. ఈసారి వార్డుల వారీగా నాటేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశాం. ఖాళీ స్థలాల్లో, ఉద్యానాల్లో, డంపింగ్‌యార్డులో విస్తృతంగా నాటాలని నిర్ణయించాం. శివారు ప్రాంతాల్లో రోడ్లకిరువైపులా పచ్చదనం పెంపొందించనున్నాం.

# ఆటలకు అడ్డంకులెన్నో..

ఉట్నూర్ : పల్లెల్లో క్రీడా నైపుణ్యం ఉన్నవారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మైదానాలు ఏర్పాటు చేయిస్తోంది. మొదటి విడత మండలానికి రెండు చొప్పున జిల్లా వ్యాప్తంగా 34 గ్రామాల్లో ఆటలస్థలాలను ఎంపిక చేశారు. అన్ని వసతులతో జూన్ 2న ప్రారంభించాల్సి ఉండగా.. సగం కూడా మొదలు కాలేదు. భూమిని చదును చేయించి, క్రీడా, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయకుండానే ప్రారంభించారు.

జిల్లాలో పంచాయతీ కేంద్రాలతో పాటు అనుబంధ గ్రామాలను కలిపి 1,172 క్రీడా మైదానాలను ఎంపిక చేయాల్సి ఉండగా, మొదటి విడతలో మండలానికి రెండు చొప్పున 34 గ్రామాలను ఎంపిక చేశారు. ఒక ఎకరం విస్తీర్ణంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులు సిద్ధం చేయాలని ప్రభుత్వం సూచించింది. ముందుగా ఎంపిక చేసిన స్థలాన్ని చదును చేసి వాటిల్లో మూడు కోర్టులతో పాటు లాంగ్‌జంప్ ఇతర వ్యాయామాలు చేసేందుకు పరికరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చాల చోట్ల స్థలాలు లేకపోవడం.. ఉన్నచోట వివాదాల్లో ఉండటం అధికారులకు ఇబ్బందిగా మారింది. సగానికి పైగా గ్రామాల్లో తక్కువ విస్తీర్ణంలో భూమిని చదును చేసి, జూన్ 2న జిల్లా వ్యాప్తంగా ప్రారంభించారు. ఇంత వరకు 8 గ్రామాల్లోనే పూర్తిస్థాయిలో సిద్ధమయ్యాయి.

నిధుల సమస్య?

క్రీడా మైదానాల కోసం ఎలాంటి ప్రత్యేక నిధులు మంజూరు చేయకుండా, గ్రామ పంచాయతీ, ఉపాధిహామీ పథకం నిధులు రూ.4 లక్షల వరకు వాడుకోవాలని ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటికే నిధుల సమస్యతో కొట్టుమిట్టాడుతున్న గ్రామాలకు ఇది తలకు మించిన భారంగా మారింది.

పరికరాలు ఏర్పాటు చేయిస్తున్నాం..

కిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

చదును చేసి, క్రీడా మైదానాలను సిద్ధం చేస్తున్నాం. మొదటి విడత గ్రామాల్లోనూ పరికరాలు ఏర్పాటు చేయిస్తున్నాం. స్థలాల పరిశీలన, ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో త్వరలోనే పూర్తి చేయిస్తాం.

భూమిని చదును చేసి.. వదిలేసి..

ఉట్నూరు మండలం శ్యాంనాయక్ తండాలో మొదటి విడతలో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేశారు. కేవలం భూమిని చదును చేశారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులతో పాటు లాంగ్‌జంప్ ఇతర వ్యాయామాలకు సంబంధించిన పరికరాలను ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. ఇదే మండలంలోని మత్తడిగూడలో మైదానం మాత్రమే తయారు చేసి, వదిలేశారు.

# అసంఘటిత కార్మికులకు అండగా ఇ-శ్రమ్

జనగామ : అసంఘటిత రంగంలోని కార్మికులు, వలస కార్మికులు, చిరు వ్యాపారులకు భరోసా కల్పించేందుకు కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ ఇ-శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించింది. దీంతో కార్మికుల సంక్షేమం కోసం వివిధ సామాజిక భద్రతా పథకాలను మరింత మెరుగ్గా అమలు చేయడానికి వీలవుతుంది. కామన్ సర్వీస్ సెంటర్లలో కార్మికులు ఉచితంగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ పోర్టల్‌ను ప్రారంభించి ఏడాది గడిచినా.. చాలా మంది దరఖాస్తు చేసుకోకపోవడంతో సంక్షేమ పథకాలకు, హక్కులకు దూరమవుతున్నారు.

చేకూరే ప్రయోజనాలివి !అసంఘటిత రంగంలోని కార్మికులు ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుంటే 12 అంకెలు కలిగిన ప్రత్యేక గుర్తింపు కార్డులు అందజేస్తారు. ఈ కార్డులు ఉన్నవారికే అన్ని రకాల సామాజిక భద్రత పథకాలు, సంక్షేమ పథకాలను వర్తింపజేస్తారు. ఇందులో నమోదు చేసుకున్న ప్రతి కార్మికుడికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తూ అంగవైకల్యం చెందితే రూ.లక్ష బీమాను ఉచితంగా అందజేస్తారు. అసంఘటిత రంగంలోని కార్మికుల కోసం ప్రవేశపెట్టే పథకాల్లో నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యమిస్తారు. వలస కార్మికులు ఎక్కడ ఉన్నారో గుర్తించి ఉపాధి మార్గాలను చూపిస్తారు. కార్మికుడిగా నమోదైతే ప్రభుత్వమే తోడ్పాటు అందిస్తుంది. విపత్తులు సంభవించినప్పుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సహాయకారిగా ఉంటుంది. ఇశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడంలో చాలా మంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కొందరు



మాత్రమే సద్వినియోగం చేసుకుంటున్నారు.

కొరవడిన అవగాహన !జిల్లాలో 80 వేలకు పైగా కార్మికులు ఉండగా... ఇంకా 11వేల మందికి పైగా ఇ-శ్రమ్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంది. ప్రారంభంలో అధికారుల అవగాహన కార్యక్రమాలు, కార్మిక సంఘాల నేతల సూచనలతో నమోదు చేసుకునేందుకు కార్మికులు పోటీపడ్డారు. క్రమంగా ఇ-శ్రమ్ పోర్టల్‌పై ఆదరణ కొరవడుతోంది. సంక్షేమ పథకాల ఫలాలు కార్మికులందరికీ అందేలా కార్మిక సంఘాల నేతలు, అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు.

అర్హులు వీరే !ఈ పథకంలో చేరదల్చుకున్న కార్మికులు అసంఘటిత రంగంలో తప్పనిసరిగా పనిచేయాలి. ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం లేనివారు, వ్యవసాయ కూలీలు, దాని అనుబంధ రంగాల్లో పని చేసే వారు, చిన్న, సన్నకారు రైతులు, ఉమ్మడి వ్యవసాయదారులు, మత్స్యకారులు, ఉద్యానవనాల్లో పనిచేసే కూలీలు, బావుల తవ్వకం, పూడిక తీసే కూలీలు, వీధి వ్యాపారులు, దుకాణాల్లో పనిచేసే గుమస్తాలు, తోపుడు బండ్లవారు, వడ్రంగులు, ఎలక్ట్రీషియన్లు, ఆదాయపన్ను పరిధిలో లేని వారు, చేనేత, ఇటుక బట్టీలు, క్వారీలు, మిల్లులు, ఉపాధి కూలీలు, ఆశ, అంగన్‌వాడీ ఆయాలు, రిక్షావాలాలు, ఆటో డ్రైవర్లు, కూరగాయల వ్యాపారులు, పండ్ల విక్రేతలతో పాటు ఇతర రంగాల్లో పనిచేసే దినసరి కూలీలు ఈ పథకంలో చేరేందుకు అర్హులు.

జిల్లాలో కార్మికుల సంఖ్య : 80,000

ఇ-శ్రమ్‌లో నమోదు చేసుకున్న వారు : 69,000

ఇంకా నమోదు కావాల్సిన వారు : 11,000

అందరూ నమోదు చేసుకోవాలి

-కుమారస్వామి, జిల్లా కార్మికశాఖ అధికారి

అసంఘటిత కార్మికులందరూ తప్పనిసరిగా ఇ-శ్రమ్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకోవాలి. నమోదు చేసుకునేందుకు నిర్ణీత గడువేమీ లేదు. ఆధార్‌కార్డుతో చరవాణి నెంబర్ అనుసంధానమై ఉన్నవారు సమీపంలోని మీసేవా కేంద్రాల్లో లేదా, సీఎస్‌సీ కేంద్రాల్లో అయిదు నిమిషాల్లో నమోదు చేసుకోవచ్చు. సంక్షేమ పథకాలు పొందవచ్చు.

# భవిష్యనిధి ఖాతాల విభజన ప్రక్రియ షురూ

జనగామ : చాలాకాలం నుంచి ఊరిస్తున్న.. జడ్పీ ఆధీనంలోని ఉద్యోగుల భవిష్యనిధి ఖాతాల విభజన ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో త్వరలోనే కొత్త జిల్లాల నుంచి ఉపాధ్యాయులు, జిల్లా పరిషత్ ఉద్యోగులు తమ ఖాతాలను నిర్వహించుకోవచ్చు. ఈమేరకు ప్రభుత్వం జిల్లాల వారీగా ఖాతాల విభజన ప్రక్రియ చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేసింది.

ఏమిటా జీపీఎఫ్.. ?

జిల్లా పరిషత్ ఆధీనంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగుల్లో పొదుపు భావనలు పెంచేందుకు, వడ్డీని జమ చేస్తూ వారి అవసరాల మేరకు నగదు పొందేలా నిబంధనలు రూపొందించారు. పొదుపు చేసిన మొత్తం నుంచి రుణం తీసుకొని తర్వాత వాయిదాలుగా చెల్లించడం, లేదా పాక్షిక ఉపసంహరణ.. అనే రెండు సదుపాయాలు ఉన్నాయి. ఇందులో పొదుపు తప్పనిసరి చేయడంతో ప్రతి నెలా రూ.5వేల వరకు పొదుపు చేయడంతోపాటు కరవుభత్యం, వేతన స్థిరీకరణ ప్రక్రియ సందర్భంగా అమలు తేదీ నుంచి అందే మొత్తాలను నగదు రూపంలో ఇవ్వకుండా వీటిలో జమచేయడం సాధారణంగా జరుగుతున్న ప్రక్రియ. రాష్ట్ర అవతరణ అనంతరం కొత్త జిల్లాల ఏర్పాటు, జిల్లా పరిషత్‌లు ప్రారంభమైనా జీపీఎఫ్ ఖాతాల విభజన జరగడంలేదు. తమ పొదుపు సొమ్ము సరిగా జమ కావడం లేదని, వడ్డీ సకాలంలో జమ కావడం లేదనే ఆరోపణలున్నాయి. ఇదివరకు ఆరుశాతం ఇచ్చే వార్షిక వడ్డీని ప్రభుత్వం ఎనిమిది శాతానికి పెంచింది.

ఆన్‌లైన్‌లో ఉద్యోగుల ఖాతాలు..వీటి పరిష్కారానికి ప్రభుత్వం సంకల్పించింది. ప్రతి ఉద్యోగి ఖాతాను ఆన్‌లైన్‌లోకి తెచ్చింది. ఉపాధ్యాయులు, ఉద్యోగుల భవిష్యనిధి నిల్వలను ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం చిక్కింది. వీటిని తమ జిల్లాలకు విభజించాలని ప్రభుత్వాన్ని వీరు చాలాకాలం నుంచి అభ్యర్థిస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం ఇందుకు సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు రెండు రోజుల క్రితం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జీపీఎఫ్ ఖాతాలను కొత్త జిల్లాలకు విభజన ప్రక్రియ ప్రారంభమైందని పూర్తయ్యేవరకు రుణాలు తీసుకోవడం తదితరాలు అనుమతించడం జరగదని, ఉద్యోగులు గమనించాలని సూచించారు.

ప్రయోజనాలివి..పరిపాలన సౌలభ్యం కోసం ప్రారంభించిన కొత్త జిల్లాలకు వీటిని బదిలీచేయడంతో తేడాలుంటే వెంటనే సరి చేసుకోవడం జీపీఎఫ్ సభ్యులకు సులువు.పాత జిల్లాకేంద్రానికి వెళ్లడం, పనిదినాన్ని వృథా చేసుకోవడం తదితర ఇబ్బందులు తప్పుతాయి.అధికారులు ఏం చేస్తారంటే..?ఉమ్మడి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి.. కొత్తగా ఏర్పడిన జిల్లాల వారీగా ఉద్యోగులు, ఉపాధ్యాయులను విభజించి వారి పొదుపులు, ఆయా కొత్త జిల్లాలకు కేటాయిస్తారు. ఇప్పటి వరకు వచ్చిన వడ్డీ కూడా జమ చేసి, ప్రభుత్వం నుంచి బకాయిలు విడుదల కాగానే వారి ఖాతాలకు జమ చేయాలి.

# వర్షం తగ్గినా.. పంట కష్టమే!



మహబూబాబాద్ : మహబూబాబాద్ పట్టణంలోని విలీన గ్రామం గాంధీపురంలో నేలవాలిన వరిని ఏఈవో పూజిత, రైతులు పరిశీలిస్తున్న చిత్రమిది. ఇక్కడ 152 మంది రైతులు 258 ఎకరాల్లో వరి సాగు చేశారు. కూలీల కొరత సమస్యతో 150 మంది రైతులు 250 ఎకరాల్లో నాట్లు వేయకుండా డ్రమ్‌సీడర్ విధానంలో సాగు చేపట్టారు. ఇద్దరు రైతులు మాత్రమే 8 ఎకరాల్లో కూలీలతో నాట్లు వేయించారు. డ్రమ్‌సీడర్ విధానంతో ఒక్కొక్కరికి కూలీ ఖర్చుకు అయ్యే రూ.10 వేలు మిగిలాయి. పంటలకు అడుగు మందులు, రసాయన మందుల పిచికారీ, పొలాన్ని దమ్ము చేయడం, విత్తనాల ఖర్చులకు ఎకరానికి రూ.25 వేల పెట్టుబడి పెట్టారు. ఇప్పటి వరకు 5 ఎకరాల్లోనే కోత జరిగింది. కోతలు ముమ్మరమయ్యే సమయంలోనే వరుణుడు అడ్డుపడ్డాడు. ఫలితంగా ఎకరానికి 24 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది ఇప్పుడు 15 నుంచి 18 క్వింటాళ్లే చేతికొచ్చేలా ఉందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికిప్పుడు వర్షం తగ్గినా మరో వారం రోజుల పాటు యంత్రాలు పొలాల్లోకి వచ్చేలా లేవని రైతులు మంగ్యా, వెంకన్న పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గతంలో ఎప్పుడూ లేనివిధంగా కురుస్తున్న అకాల వర్షాలతో వరి కోతలకు ఆటంకం ఏర్పడుతుండడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఈదురుగాలులు, వడగళ్లతో పంటంతా నేలవాలింది. నీళ్లు నిల్వ ఉండడంతో ధాన్యం మొలకెత్తుతోంది. వర్షాలు తగ్గినా పంట చేతికి రావడం కష్టమేనని.. పొలాల్లోనే వదిలేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటి వరకు 80 శాతం మొక్కజొన్న, 50 శాతం వరి కోతలు పూర్తయినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వారం రోజుల్లోనే 90 శాతం పూర్తి కావాల్సినవి అకాల వర్షాలతో నిలిచిపోయాయి.

1.73 లక్షల ఎకరాల్లో నష్టం

మార్చి, ఏప్రిల్, మే నెల ఇప్పటి వరకు కురిసిన వర్షాలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,26,732 మంది రైతులకు చెందిన 1,73,457. 950 ఎకరాల్లోని వరి, మొక్కజొన్న, మామిడి, ఇతర పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. మార్చిలో జరిగిన నష్టానికి సంబంధించి రైతుల సమగ్ర వివరాలను ప్రభుత్వానికి పంపించారు. ఇప్పుడు రెండు, మూడో సారి జరిగిన పంట నష్టం వివరాలను వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

వరి కోత.. అదనపు భారం

వర్షాలతో పొలాలన్నీ నీటితో నిండడంతో వరి కోత యంత్రాలు అందులోకి వెళ్లి కోయలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు కూలీల కొరత వేధిస్తోంది. ఎంతో కొంత మిగిలిన పంటను కాపాడుకోవడానికి సైతం యంత్రాలే దిక్కు కానున్నాయి. ఇప్పటికే పంట నష్టపోయిన రైతులకు ఇది అదనపు భారం కానుంది. గంటకు టూ వీల్‌కు రూ.2300, ఫోర్ వీల్‌కు రూ.2800, చైన్ల యంత్రానికి రూ.3500 తీసుకుంటున్నారు. ఒకేసారి కోతలు ముమ్మరం చేస్తే ఈ యంత్రాల కొరత ఏర్పడనుంది..

ధాన్యం మొలకెత్తింది.. కష్టాన్ని కొల్లగొట్టింది!

అకాల వర్షాలకు కోత దశలోనే నీట మునిగి మొలకెత్తిన వరి ధాన్యాన్ని చూపుతున్న ఈ రైతు మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండలం పెద్ద రామోజీతండాకు చెందిన బానోతు రాములు. యాసంగిలో ఎకరంన్నరలో వరి సాగు చేశారు. ట్రాక్టరుతో పొలాన్ని దమ్ము చేయడం నుంచి నాటు వేసి పంట కోత దశకు వచ్చే వరకు రూ.60 వేలు పెట్టుబడి పెట్టారు. మూడు రోజుల్లో పంట కోత చేపట్టాలనుకున్న సమయంలోనే అకాల వర్షాలు కురిశాయి. ఎగువ నుంచి వచ్చిన వరద నీటితో అరెకరం పొలం నీట మునిగింది. వడ్లు నీటిలోనే మొలకెత్తుతున్నాయి. వర్షం వల్ల సుమారు 18 క్వింటాళ్ల ధాన్యం మొలకెత్తిందని రాములు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దయనీయ పరిస్థితి ఈ రైతుదే కాదు.. ఉమ్మడి జిల్లాలోని చాలా మంది కర్షకులది. ఏ గ్రామంలో చూసినా వరిపొలాలు నేలవాలి కనిపిస్తున్నాయి.

వర్షం పడితే ఆశలు గల్లంతు

బోడ మంగ్యా, గాంధీపురం

యాసంగిలో మూడెకరాల్లో వరి సాగు చేశాను. ఎకరానికి రూ.25 వేల పెట్టుబడి పెట్టాను. కోసే దశలో వర్షం పడింది. ఆశించిన దిగుబడి తగ్గనుంది. వాన గెరువు ఇస్తేనే పంట చేతికొస్తుంది. లేకుంటే ఆశలను వదులుకోవాల్సిన పరిస్థితులున్నాయి.

రూ. రెండు లక్షల పెట్టుబడి పెట్టాను

గండమాల వెంకన్న, గాంధీపురం

మాకున్న ఏడెకరాలతో పాటు రెండెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వరి వేశాను. సుమారు రూ. 2 లక్షలు పెట్టుబడి ఖర్చు పెట్టాం. అకాల వర్షంతో పంట కోత నిలిచింది. వాన తగ్గితేనే ఇంటికి వస్తుంది. లేకుంటే నష్టపోవాల్సి వస్తుంది.

# యథేచ్ఛగా మట్టి దందా



భూపాలపల్లి: జిల్లాలో మట్టి అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. స్థిరాస్తి వ్యాపారులు ఏర్పాటు చేస్తున్న వెంచర్లు, గృహ నిర్మాణాలు, రోడ్ల నిర్మాణాల కోసం అవసరమైన మట్టిని అక్రమార్కులు ఎలాంటి అనుమతి లేకుండా.. ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా అక్రమంగా తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంతో పాటు సమీపంలోని పలు గ్రామాల్లో స్థిరాస్తి వ్యాపారులు వ్యవసాయ భూములను కొనుగోలు చేసి వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. వాటిలో రహదారుల ఏర్పాటు, పల్లపు ప్రాంతాల్లో చదును పనులకు మట్టితో పాటు మొరం అవసరం అవుతోంది. దీంతోపాటు వివిధ గ్రామాల్లో రోడ్ల పనులకు కూడా మొరం అవసరం ఉండటంతో ట్రాక్టర్లు, టిప్పర్ల యజమానులు ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో అనుమతులు పొందకుండానే మట్టి, మొరం తరలించుకపోతున్నారు. ఎక్కడెక్కడంటే..భూపాలపల్లి మండలం గొర్లవీడు గ్రామంలోని పెద్ద చెరువు శిఖం, జంగేడు గ్రామ శివారులోని వడ్లోని వాగు ప్రాంతంలో ఇటీవల యథేచ్ఛగా మొరాన్ని తరలించారు. కాశీంపల్లి సమీపంలో మల్హర్ మండలం తాడ్వాయి రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ, అటవీశాఖ భూముల్లో నుంచి కొన్ని సంవత్సరాలుగా మట్టి దందా కొనసాగుతోంది. జంగేడు గ్రామ సమీపంలోని మంగలికుంట శిఖం భూముల్లో నుంచి లక్షలాది క్యూబిక్ మీటర్ల మట్టిని గృహ నిర్మాణాలకు తరలించారు. గణపురం మండలం చెల్పూరు నుంచి భూపాలపల్లి, కాటారం వరకు జాతీయ రహదారికి అతి సమీపంలో ఏర్పాటు చేసిన వెంచర్లలో రోడ్ల ఏర్పాటుకు ప్రభుత్వ భూముల నుంచి మొరాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. మంజూరునగర్, చెల్పూరు ప్రాంతాల్లోని తుమ్మల చెరువు, గోరంట్ల కుంట, బీసీ కాలనీ సమీపంలోని ఎర్రచెరువు తదితర కుంటల నుంచి ఇటీవల మట్టి, మొరాన్ని తరలించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు చెరువుల్లో నీరు చేరడంతో ప్రభుత్వ, ప్రైవేటు భూముల నుంచి గుట్టుచప్పుడు కాకుండా రాత్రి పూట మొరాన్ని తరలిస్తున్నారు. దీనికి ఎలాంటి రాయల్టీని ప్రభుత్వానికి చెల్లించడం లేదు. తుమ్మల చెరువు శిఖంలో ఆరు మీటర్ల లోతు వరకు మట్టి కోసం తవ్వడంతో ఏర్పడిన గుంతలు చూసి, మత్స్యకారులు గతేడాది అడ్డుకొని, అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఈ చెరువు శిఖం నుంచి అక్రమార్కులు రాత్రివేళ దర్జాగా మట్టిని తరలించుకుపో తున్నారు.అనుమతుల మాటేలేదు..ప్రైవేటు భూముల నుంచి సైతం మొరం, మట్టి తరలించాలంటే పంచాయతీలు, రెవెన్యూ, గనుల శాఖల నుంచి అనుమతులు తీసుకుని తవ్వకాలు చేయాలి. ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వడం కోసం క్యూబిక్ మీటరు చొప్పున నిర్దేశించిన రాయిల్టీ చెల్లించాలి. అదే చెరువులు, కుంటల్లో అయితే నీటి పారుదల, గనుల శాఖల నుంచి అనుమతి పొందాలి. క్యూబిక్ మీటరుకు రూ.30 చొప్పున గనుల శాఖకు రుసుం చెల్లించాలి. ఎకరం భూమిలో 15 అడుగుల లోతు మట్టి తవ్వితే సుమారుగా 22 వేల క్యూబిక్ మీటర్ల మట్టి వస్తుంది. ఈ లెక్కన ఎకరానికి రూ.6.60 లక్షల రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. అక్రమార్కులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. ధనార్జనే ధ్యేయంగా భారీ యంత్రాలతో మట్టి తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. అధికారులు అడపాదడపా దాడులు చేసి ఒకటో రెండో ట్రాక్టర్లను పట్టుకోవడం తప్ప కఠినంగా వ్యవహరించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

విచారించి చర్యలు తీసుకుంటాం..- మహ్మద్ ఇగ్బాల్, తహసీల్దారు, భూపాలపల్లిఅనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, పట్టా భూముల నుంచి మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవు. అనుమతులు లేకుండా మొరం, మట్టి తరలించడం చట్ట విరుద్ధం. ఎక్కడైనా మట్టి అక్రమ రవాణా జరిగితే స్థానికులు సమాచారం అందించాలి. ఎవరినీ ఉపేక్షించకుండా చర్యలు తీసుకుంటాం. ఇటీవల ఓ ప్రజాప్రతినిధిపై కేసు కూడా నమోదు చేశాం. మట్టి తవ్వకాలకు ఉపయోగించే వాహనాలను సైతం సీజ్ చేస్తాం.

# ప్రమాదపుటంచున పాలంపేట!

ములుగు : వెంకటాపూర్ మండలం పాలంపేటలో వృథాగా ఉన్న సొరంగ మార్గం ప్రమాదకరంగా మారింది. 2010లో రామప్పకు సుమారు 700 మీటర్ల దూరంలో చేపట్టిన దేవాదుల సొరంగమార్గం పనులతో ఆలయానికి ముప్పు పొంచి ఉందని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో పనులను శాశ్వతంగా నిలిపివేసి నీటి సరఫరాకు ప్రత్యామ్నాయంగా పైపులైన్లు ఏర్పాటు చేశారు. కానీ ప్రధాన టన్నెల్‌ను చేరేందుకు భూ పైభాగం నుంచి సుమారు 90 అడుగుల లోతు నుంచి 500 మీటర్ల మేర(పోచమ్మ, హనుమాన్ గుడి కింద నుంచి పాలంపేట ఆర్చి వరకు) సొరంగం తవ్వారు. తవ్విన మట్టిని పాలంపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే నిల్వ చేశారు. ప్రస్తుతం ఆ మట్టి మాయమైపోయింది. సొరంగం పూడ్చే వీలు లేకుండా పోయింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలోనే రామప్ప అభివృద్ధి పనుల్లో భాగంగా ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్ నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన టన్నెల్ పనులు పూర్తికాగానే అనుసంధానంగా ఉన్న సొరంగమార్గాన్ని తిరిగి పూడ్చి వేయాలి. కానీ టన్నెల్ పనుల అలైన్‌మెంట్ మారడంతో గుత్తేదారు మధ్యలోనే వదిలేసి వెళ్లాడు. సొరంగ మార్గం పూర్తిగా నీటితో నిండిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది.

ఆందోళనలో ప్రజలు

పాలంపేట గ్రామం కింద సుమారు 90 అడుగుల లోతులో ఆరున్నర మీటర్ల పొడవు వెడల్పుతో తవ్విన దేవాదుల సొరంగమార్గం ప్రస్తుతం నీటితో నిండి ఉంది. ఏమైనా ప్రకృతి విపత్తులు సంభవిస్తే సొరంగం పైభాగంలోని సుమారు 100 నుంచి 150 ఇళ్లు నేలమట్టమయ్యే అవకాశం ఉంది. వందల సంఖ్యలో ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉంది. 13 సంవత్సరాల నుంచి ప్రజలు భయంభయంగా కాలం వెళ్లదీస్తున్నారు. సాగు, తాగునీటి కోసం చేపట్టే అభివృద్ధి పని కావడంతో తిరిగి పూడ్చేస్తారని ఒప్పుకున్నామని, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు.

ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్ భద్రమేనా..?

యునెస్కో గుర్తింపు పొందిన రామప్పకు 500 మీటర్ల (బఫర్‌జోన్ అవతల) దూరంలో ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. దాంతో ప్రసాద్ పథకంలో మంజూరైన రూ.30 కోట్లతో పనులు మొదలు పెట్టారు. ఈ ప్రాంతానికి కేవలం 100 మీటర్ల దూరంలోనే సొరంగ మార్గం ఉంది. భారీ కట్టడానికి భవిష్యత్తులో ఏమైనా ప్రమాదం తలెత్తే ఆస్కారం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సొరంగమార్గం పూడ్చాల్సిన మట్టిని రామప్పలో చేపట్టే వివిధ పనులకు, ప్రైవేటు వ్యక్తులు తరలించుకుని వెళ్లినా ఎవ్వరూ పట్టించుకోలేదు. ఒకవేళ పూడ్చాల్సి వస్తే ఎక్కడి నుంచి మట్టిని తీసుకువస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

వెంటనే పూడ్చి వేయాలి

ఆకిరెడ్డి రామ్మోహన్‌రావు, మాజీ సర్పంచి, పాలంపేట

నేను పాలంపేట సర్పంచిగా ఉన్న సమయంలోనే ఈ సొరంగ పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయానికి దగ్గరలో తవ్వకాలు వద్దని మొదట్లో వ్యతిరేకించాను. పాలంపేట- లక్ష్మీదేవిపేట రోడ్డుకు సమీపంలో నిర్మించమని చెప్పాం. అయినా మొదలు పెట్టి మధ్యలోనే వదిలేశారు. అనుకోకుండా ఏమైనా ప్రమాదం సంభవిస్తే గ్రామస్థులకు పెనుప్రమాదం జరిగే అవకాశం ఉంది. సొరంగ మార్గానికి దగ్గరలోనే భారీ కట్టడాలు చేపడుతున్నారు. వాటికి కూడా ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. ముందుగానే టన్నెల్‌ను పూడ్చివేస్తే మేలు. అధికారులు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

పూర్తి వివరాలు తెలుసుకుంటా..వెంకటకృష్ణారావు, ఈఈ, ములుగు

గతంలో చేపట్టిన తవ్వకాలపై నాకు పూర్తి అవగాహన లేదు. సొరంగాన్ని అప్పుడే పూడ్చేసి ఉండాలి. పూర్తి వివరాలు తెలుసుకుంటాను. దేవాదుల పాలంపేట సొరంగమార్గం మొదలుపెట్టిన

సంవత్సరం: 2010

సొరంగమార్గం లోతు: 90 అడుగులు

పొడవు: సుమారు 450-500 మీటర్లు

ఆడిట్ టన్నెల్ పొడవు: 6.5 మీ.

వెడల్పు: 6.5 మీ.

# ఏజెన్సీపై జ్వర పంజా!

డోర్నకల్ : ములుగు జిల్లాలోని ఏజెన్సీలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇటీవల స్వల్ప కాలంలోనే జ్వరపీడితుల సంఖ్య విపరీతంగా పెరిగింది. అధికారులు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా గ్రామాల్లో వ్యాధుల వ్యాప్తి తగ్గడం లేదు. విషజ్వరాలు చాపకింద నీరులా వ్యాపిస్తూ ఏజెన్సీలో అలజడి రేపుతున్నాయి. మన్యంలో వర్షాకాలం మలేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి జ్వరాలు వ్యాపించడం సాధారణం. కానీ ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా వేసవిలోనూ జ్వరాలు పంజా విసురుతున్నాయి. జిల్లాలో కేవలం మూడు రోజుల వ్యవధిలోనే ఇద్దరు జ్వరాలతో మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది.

అకాల వర్షాలు.. విజృంభిస్తున్న దోమలు

ఇటీవల వరుసగా కురుస్తున్న అకాల వర్షాలే ఏజెన్సీలో జ్వరాలకు కారణమని వైద్యాధికారులు చెబుతున్నారు. జిల్లాలోని వాజేడు, మంగపేట, వెంకటాపురం, కన్నాయిగూడెం తదితర మండలాల్లో జ్వర పీడితులు ఉన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. రహదారులు, ఖాళీ స్థలాలు, గుంతల్లో నీటి నిల్వలు ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. అలాగే పగటిపూట తీవ్ర ఎండలతోనూ సతమతం అవుతున్నారు. మారుమూల గ్రామాల్లో సరైన వైద్యం అందక జ్వరబాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దోమ తెరల వినియోగంపై అవగాహన లేక..

జ్వరాలకు ముఖ్యంగా దోమలే కారణం. దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా అది పూర్తి స్థాయిలో జరగడం లేదు. ఏజెన్సీ వాసులకు ఏటా దోమ తెరలు పంపిణీ చేస్తున్నారు. కాని వాటి వినియోగంపై చైతన్యం అంతంతే. వర్షాలు కురిసినప్పుడు తప్పనిసరిగా దోమ తెరలు వినియోగించాలని ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలి.

మూడు రోజుల వ్యవధిలో ఇద్దరి మృత్యువాత

ఈనెల 2వ తేదీన మంగపేట మండలం తిమ్మంపేటకు చెందిన ఆక స్రవంతి(32) అనే మహిళ డెంగీతో మృతిచెందారు. ఆమెకు భర్త ఇద్దరు చిన్నపిల్లలున్నారు. అకాల మరణంతో ఆమె కుటుంబంలో విషాదం అలుముకుంది. తిమ్మంపేటలో పదుల సంఖ్యలో జ్వర బాధితులున్నారు. వాజేడు మండలం కొంగాలలో బుధవారం యాలం రామ్‌కుమార్(38) జ్వరంతో మృత్యువాతపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వాజేడు పీహెచ్‌సీకి వారం రోజుల్లో 65 మంది జ్వరబాధితులు వచ్చారు. ఏటూరునాగారం సీహెచ్‌సీకి కూడా జ్వర బాధితులు ఎక్కువగానే వస్తున్నారు. ఏజెన్సీలో దాదాపు పది రోజుల నుంచి ఈ సమస్య నెలకొంది.

నివారణకు చర్యలు తీసుకుంటున్నాంఅప్పయ్య, డీఎంహెచ్‌ఓ

వాతావరణ మార్పులు, వర్షాల కారణంగా జ్వరాలు ప్రబలుతున్నాయి. ఎప్పటికప్పుడు నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జ్వరాలు వస్తున్న గ్రామాల్లో రక్త నమూనాలు సేకరిస్తున్నాం. అవసరమైన చోట వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తాం. ఎండలకు రక్త కణాలు కూడా తగ్గుతున్నాయి. జ్వరం వస్తే ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలి. నీళ్లు ఎక్కువగా తాగాలి.

## సాంకేతిక సాగుబడి

ఖమ్మం : వ్యవసాయ రంగంపై ఆసక్తి.. సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలవాలనే ఆకాంక్ష.. అలాంటి యువతకు సాగు పాఠాలు చెపుతూ కొలువులకు దారి చూపుతోంది మధిరలోని ప్రభుత్వ వ్యవసాయ సాంకేతిక కళాశాల. ఇక్కడ కోర్సు పూర్తి చేసిన అత్యధికులు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు పొందారు. కళాశాల అభ్యర్థులు అగ్రిసెట్‌లో అత్యధిక సీట్లు సాధించి రాష్ట్రంలోనే గుర్తింపు తెచ్చారు. త్వరలో పాలిటెక్నిక్ పరీక్ష జరగనున్న నేపథ్యంలో కళాశాల గురించి కథనం..

ఏఈవో కొలువుల సాధన

కళాశాలలో ఇప్పటివరకు దాదాపు 220 మంది విద్యార్థులు కోర్సు పూర్తి చేశారు. వీరిలో 25 మందికి పైగా వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈవో)గా కొలువులు సాధించగా మరికొంత మంది ప్రయివేటు కంపెనీలలో ఉద్యోగాలు పొందారు. కళాశాలకు అనుబంధంగా అపరాల పరిశోధన కేంద్రముంది. పంటల క్షేత్రపర్యటనకు ఎంతగానో దోహదపడుతోంది.

అగ్రిసెట్ అరవై సీట్లలో పది మధిరకే..

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 15 ప్రభుత్వ, ప్రయివేటు వ్యవసాయ సాంకేతిక కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో కోర్సు పూర్తి చేసిన దాదాపు 11,00 మంది విద్యార్థులు గతేడాది రాష్ట్రంలోని అరవై సీట్లకు ప్రవేశ పరీక్ష అగ్రిసెట్ రాశారు. వీరిలో మధిరలో గత ఏడాది సాంకేతిక విద్య పూర్తి చేసిన పది మంది సీట్లు సాధించగా మరో ఇద్దరు రెండేళ్ల కిందట ఇక్కడ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు సీట్లు పొందటం విశేషం. వీరందరికి రాజేంద్రనగర్, అశ్వారావుపేట, వరంగల్ తదితర వ్యవసాయ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు లభించాయి.

అయిదేళ్లుగా రైతులకు సేవలు అందిస్తున్నా: శివకృష్ణ, ఏఈవో పాపటపల్లి2017లో రెండోసారి సర్వీస్ కమిషన్ పరీక్ష రాసి వ్యవసాయ విస్తరణ అధికారిగా ఎంపికయ్యాను. రఘునాథపాలెం మండలం పాపటపల్లి క్లస్టర్‌లో విధుల్లో చేరి అయిదేళ్లుగా రైతులకు సేవలందిస్తున్నాను. కళాశాలలో ప్రయోగాలన్నీ పోటీ పరీక్షలో ఉద్యోగం సాధించేందుకు ఎంతో ఉపకరించాయి.

కళాశాల ప్రస్థానమిదీ..

మధిరలో వ్యవసాయ సాంకేతిక కళాశాలను 2011-12లో స్థాపించారు. ఉమ్మడి జిల్లాలో ఏకైక ప్రభుత్వ కళాశాల ఇది. ఇక్కడ రెండేళ్ల డిప్లొమా కోర్సులో మొత్తం 44 సీట్లు ఉంటాయి. అందులో ప్రథమ 22 మంది, ద్వితీయ సంవత్సరం 22మంది అభ్యసిస్తారు. పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాసిన అభ్యర్థులకు ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. మధిరలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆవరణలోనే ఈ కళాశాల ఉండటం మరో ప్రత్యేకత. యాభై ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన కేంద్రంలో విత్తనం నుంచి కలుపు, పంట కోతల వరకు విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం ద్వారా బోధన జరుగు తుంది. సాగు పనులు చేస్తూనే పరిజ్ఞానం పొందుతారు. అందువల్లే ఇక్కడి విద్యార్థులు ఉన్నత చదువులతోపాటు కొలువుల సాధనలో ముందుంటున్నారు.

కీటక శాస్త్రవేత్త కావాలనేదే లక్ష్యం గండికోట శ్రుతి, ఖమ్మం

వరంగల్ వ్యవసాయ కళాశాలలో అగ్రిసెట్ సీటు సాధించా. వ్యవసాయ రంగంలో డాక్టరేట్ పొందాలనేదే లక్ష్యం. ఆ తర్వాత కీటకశాస్త్ర నిపుణురాలిగా రైతులకు సేవలందించాలని ఆకాంక్ష. మాది మధ్య తరగతి కుటుంబం. నాన్న ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తారు. అన్నదాతలకు వ్యవసాయ రంగంలో సేవలందించేందుకు పాటుపడతా.

ప్రతి అంశం క్షేత్రస్థాయికి అందిస్తా మేకల హారిక, కొత్తగూడెం

మాది మధ్య తరగతి కుటుంబం. వ్యవసాయం అంటే ఎంతో ఇష్టం. పీహెచ్‌డీ పూర్తి చేసి శాస్త్రవేత్తగా ఎదగాలన్నది లక్ష్యం. అధునాతన పద్ధతులు రైతులకు తెలియజేస్తూ అధిక ఉత్పత్తులు సాధించేలా కృషి చేస్తా. కళాశాలలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయోగపడేలా పనిచేస్తా.

కళాశాలలో చేరిన విద్యార్థులకు భవిష్యత్తు ప్రణాళిక, అనుకున్న ఆశయాలను సాధించడానికి కావలసిన శిక్షణ ఇస్తున్నాం. ప్రధానంగా ప్రయోగాలు పొలాల్లోనే నిర్వహిస్తాం. పంటలకు తెగుళ్లు, అధిక దిగుబడుల సాధనకు చేపట్టాల్సిన అంశాలను బోధిస్తూనే, పంట క్షేత్రాల్లో వారితోనే ఇవన్నీ అమలు చేయిస్తాం. వసతి గృహాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం. అధ్యాపకుల సమష్టి కృషి, సమగ్ర శిక్షణతో అగ్రిసెట్‌లో ర్యాంకులు, ఏఈవో కొలువులు సాధిస్తున్నాం. డా.కె.రుక్మిణీదేవి, కళాశాల ప్రధానాచార్యులు

## అన్నింటా అధిక లక్ష్యమే

కొత్తగూడెం : ప్రస్తుత ఉత్పత్తి సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తిలో మాత్రమే కాకుండా రవాణాలోనూ సింగరేణి మంచి ఆరంభాన్ని నమోదు చేసింది. ఈ వార్షిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో ఉత్పత్తిలో 103 శాతం లక్ష్యాన్ని సాధించిన సంస్థ.. రవాణాలో 108 శాతం లక్ష్యం అధిగమించింది. ఉత్పత్తి 55.7 లక్షల టన్నులకు చేరుకోగా.. రవాణా 55.8కి గాను 60 లక్షల టన్నులుగా నమోదైంది. గతేడాది ఇదే నెలతో పోల్చిచూస్తే వృద్ధి 5.7 శాతంగా ఉంది. యాజమాన్యం మట్టి తొలగింపు పనులపైనా ప్రత్యేక దృష్టిసారించింది. గతేడాది ఏప్రిల్ కన్నా 12.6 శాతం వృద్ధిని సాధించడం విశేషం. 410 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించాలని లక్ష్యం విధించగా..



ఏకంగా 422 లక్షల క్యూబిక్ మీటర్లు (102 శాతం) నమోదు చేశారు.

ప్రస్తుత నెల ఉత్పత్తి ఇలా..

ఉత్పత్తి: ఏప్రిల్‌లో బొగ్గు ఉత్పత్తి, రవాణా, మట్టి తొలగింపు పనుల్లో సంతృప్తికర ఫలితాలు సాధించడంతో 'మే' నెలలో అధిక మొత్తం లక్ష్యాలను నిర్దేశించుకొని సంస్థ ముందుకు వెళ్తోంది. 67.58 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం రోజుకు కనీసం 2.20 లక్షల టన్నులు వెలికితీయాల్సి ఉంటుంది.

రవాణా: బొగ్గు తరలింపు లక్ష్యాన్ని సైతం ఏప్రిల్ కంటే (60 లక్షల టన్నులు) అధికంగా 70 లక్షల టన్నులకు పెంచారు. దీన్ని చేరాలంటే ప్రస్తుతం రోజుకు కనీసం 2.26 లక్షల టన్నులు రవాణా చేయాల్సి ఉంటుంది.బండ్: మట్టి తొలగింపు లక్ష్యాన్ని యాజమాన్యం పెంచింది. ఈ నెలలో 48.05 మిలియన్ క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించాలని నిర్ణయించింది. ఈ లక్ష్యం చేరుకోవాలంటే రోజుకు కనీసం 15.5 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగించాలి. ఈ మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అధికారులు కార్మికోద్యోగులను సన్నద్ధం చేస్తున్నారు.

## చెరువు నీరు.. నేల పాలు



వైరా : తిలా పాపం.. తలా పడికెడు.. ఈ సామెత మత్స్య శాఖ, నీటిపారుదల, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలకు సరిపోలుతుంది. శాఖల మధ్య సమన్వయ లోపంతో పల్లెల్లోని సాగునీటి వనరులు వెలవెలబోతున్నాయి. సమయానికి ఎంతో కొంత నగదు ఇస్తే చాలు అక్రమాలన్నీ సక్రమాలు అయిపోతున్నాయన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో వేసవిలో విలువైన చెరువు నీటిని అక్రమంగా బయటకు పంపిస్తున్నారని స్థానికులు మొరపెట్టుకుంటున్నా స్పందన లేదు. పది రోజుల క్రితం జలకళతో ఉన్న జలాశయం నేడు వెలవెలబోతున్నా అధికారులకు కనిపించటం లేదు. ప్రశ్నిస్తే 'రాత్రి సమయంలో బయటకు తీస్తున్నారు. మేము వచ్చి అక్కడ కూర్చునేమా' అంటూ స్థానికులకు సమాధానమిస్తున్నారు. రాజకీయ ఒత్తిడి, అధికారుల నిర్లక్ష్యం మూలంగా జలాశయాలు అడుగంటి వేసవిలో భూగర్భ జలమట్టం తగ్గిపోతోంది.ఇలా చేయాల్సి ఉండగా..గ్రామాల్లో ఉన్న చేపల చెరువుల్లో మత్స్య శాఖ సభ్యులు చేపలు పెంచి, వారే పట్టుకుని ఆదాయం సమకూర్చుకోవాలి. సొసైటీలో సభ్యులుగా ఉండాలంటే వల విసరడం, తెప్ప నడపడం రావాలి. కానీ మత్స్య శాఖ అధికారులు ఈ నిబంధనలు పాటించకుండా పరిధిని మించి సభ్యులుగా తీసుకున్నారు. ఇలాంటి వారిలో కొందరికి వల విసరడం రాకపోవడంతో నీటిని బయటకు తరలించి చివరకు అడుగు నీటిలో లోపలకు నడిచి వెళ్లి చేపలు పడుతున్నారు. సులభంగా సాగాల్సిన వేట కోసం విలువైన నీటిని రాత్రి సమయంలో బయటకు తరలిస్తున్నారు. సొసైటీ వాళ్లే వ్యాపారం చేయాల్సి ఉండగా ఓ గుత్తేదారుకు వాటిని కట్టబెడుతున్నారు. వచ్చిన సొమ్మును సభ్యులకు తక్కువ మొత్తంలో ఇచ్చి మిగతా వాటిని ఆయా శాఖల అధికారులకు పంచుతున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో మత్స్యశాఖ తీరు అనేక వివాదాలకు మారుపేరుగా ఉంది.

ఎవరికి వారే..చెరువులో నీటి కట్టడికి నీటిపారుదల, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పని చేయాలి. రెండు శాఖలు ఎవరికి వారే పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. నీటిపారుదల శాఖకు మండలాల స్థాయిలో డీఈ, ఏఈలున్నా సాగునీటి పరిరక్షణలో విఫలమవుతున్నారు. కొణిజర్ల, చింతకాని, రఘునాథపాలెం, బోనకల్లు, కల్లూరు తదితర మండలాల్లో చేపల చెరువుల్లో నీరు అడుగంటింది. నిన్నమొన్నటి వరకు సాగర్ జలాలతో కళకళలాడిన జలాశయాలు ఖాళీ అవుతున్నాయి. వాటికింద ఎలాంటి పంటలు లేకున్నా ఇదే పరిస్థితి.

మచ్చుకు కొన్ని... కొణిజర్ల చెరువులో చేపల వేట కోసం నీటిని బయటకు తీయడంతో అడుగంటింది. దీనిపై పత్రికల్లో కథనాలు వచ్చినా అధికారుల్లో కదలిక లేదు. తల్లాడ ఏదుళ్ల చెరువు, ఇతరచోట్లా నీరు బయటకొదిలి వేట చేపట్టారు. వైరా మండల నల్లచెరువులో నీటి తరలింపు సమయంలో ఏటా రైతులు, సొసైటీ వాళ్లకు వివాదం చోటుచేసుకుంటోంది. కూసుమంచి, ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, చింతకాని, కొణిజర్ల, వైరా మండలాల్లో చాలాచోట్ల వెలవెలబోతున్నాయి. కొణిజర్ల, చింతకాని, ఏన్కూరు, మధిర మండలాల్లో సొసైటీ సభ్యుల సంఖ్య చెరువు విస్తీర్ణం కంటే అధికంగా ఉంది. అదనంగా తీసుకోవడంతో వివాదాలు చోటుచేసుకున్నాయి.

చేపల వేట కోసం నీటిని బయటకు పంపొద్దు. నీరున్నా కచ్చు వలల ద్వారా వేట సాగించొచ్చు. దీనిమీద సభ్యులకు అవగాహన ఉంటుంది. అనధికారికంగా చెరువుల నుంచి నీరు బయటకు పంపిస్తే మత్స్యసొసైటీ మీద చర్యలు తీసుకోవచ్చు. మా దృష్టికి వస్తే వెంటనే నీటిపారుదల శాఖకు నివేదించి చర్యలు కోరుతాం.

ఆంజనేయస్వామి, మత్స్యశాఖ ఏడీ

## తపాలా కొలువుల్లో మహిళా ముద్ర



ఖమ్మం : తపాలాశాఖ ఇటీవల గ్రామీణ్ డాక్ సేవక్ పోస్టులను భారీగా భర్తీ చేసింది. ఖమ్మం తపాలా డివిజన్(ఉమ్మడి ఖమ్మం జిల్లా)లో ఈ ఉద్యోగాల్లో మహిళలు ఎక్కువగా ఎంపికయ్యారు. రెండేళ్లుగా జరిగిన నియామక ప్రక్రియలో మహిళలే అధికంగా ఉన్నారు. తపాలా డివిజన్‌లో 750 గ్రామీణ తపాలా కార్యాలయాలు మనుగడలో ఉన్నాయి. ఇందులో 1100 మంది గ్రామీణ్ డాక్ సేవక్‌లు పని చేస్తున్నారు. రెండేళ్ల క్రితం వరకు ఈ సంఖ్య 530గా ఉంది. అప్పట్లో మహిళా ఉద్యోగుల సంఖ్య కూడా తక్కువ. గత ఏడాది 220 పోస్టులు భర్తీ చేశారు. ఇందులో అత్యధికంగా మహిళలే నియమితులయ్యారు. మొత్తంగా చూస్తే 1100 మంది జీడీఎస్‌లు పని చేస్తుండగా ఇందులో మహిళల సంఖ్య 364. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో పదో తరగతిలో అత్యధిక మార్కులు పొందిన వారికి జీడీఎస్ ఉద్యోగం ఇచ్చే విధానాన్ని తపాలాశాఖ అమలు చేస్తోంది. ఇంజినీరింగ్, ఇతర ఉన్నత చదువులు పూర్తి చేసుకున్న నిరుద్యోగులు, ఉద్యోగాల వేటలో అలసిన వారు.. చేస్తున్న ఉద్యోగాలు నచ్చక, గ్రూప్స్‌కు సిద్ధమవుతున్నవారు జీడీఎస్‌లుగా చేరుతున్నారు. ఇందులో సహాయకులుగా చేరేవారికి కనీస వేతనం నెలకు పది వేలు, బీపీఎంలకు రూ.12 వేలు కనీసం వేతనంగా తపాలా శాఖ చెల్లిస్తోంది. పని భారాన్ని బట్టి వేతనాలు పెరిగే సదుపాయం ఉంది.

విస్తృతమవుతున్న శాఖ

తపాలా శాఖలో తపాలా బ్యాంకు సదుపాయం వచ్చాక కార్యకలాపాలు మరింత విస్తృతమయ్యాయి. లెఫ్ట్‌వింగ్ పథకంలో భాగంగా గత ఏడాది నుంచి 220 అదనపు గ్రామాలకు తపాలా సేవకులు చేరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం పట్టణాల్లో ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా 69 ఉప, 750 గ్రామీణ కార్యాలయాలు పని చేస్తున్నాయి.

ఐటీ ఉద్యోగం వదిలేసి...ఇంజినీరింగ్ చదువు పూర్తి చేసుకొన్న ఓ యువతి తపాలా శాఖలో జీడీఎస్ ఉద్యోగంలో చేరింది. ఆమె ఖమ్మం నగరంలోని తపాలా కార్యాలయంలో పోస్టు ఉమెన్ బాధ్యతలు నిర్వర్తిస్తోంది. 'ఐటీ ఉద్యోగంలో రాత్రిళ్లు పని చేయాల్సి వస్తోంది. ఏదైనా మరో ఉద్యోగానికి సిద్ధం కావానుకుంటే సమయం కుదరడం లేదు. దీంతో వదిలేసి జీడీఎస్‌గా చేరా.. 5 గంటల పని ఉంటుంది. పూర్తి చేసుకుంటే నెలకు కనీస వేతనం, తగిన సమయం లభిస్తోంది. అందుకే ఇందులో చేరానని' సదరు యువతి తెలిపారు. ఈ కోణంలో చూస్తూ జీడీఎస్‌లుగా చేరిన మహిళలు చాలామంది ఉన్నారు. ఏ గ్రామంలో దరఖాస్తు చేసుకుంటే అర్హులు అక్కడే ఉద్యోగం పొందే అవకాశం ఉన్నందున ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని తపాలా అధికారులు వివరించారు.

## రూ.71.35 కోట్లతో మెప్మా వార్షిక ప్రణాళిక

ఖమ్మం : ఖమ్మం జిల్లాలోని పుర, నగర పాలకాల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు లింకేజీ, వీధి వ్యాపారులు, దివ్యాంగుల సంఘాల రుణ లక్ష్యాల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. తద్వారా 749 స్వయం సహాయ సంఘాలు, ఏడు దివ్యాంగుల సంఘాలు, పది వీధి వ్యాపారుల సంఘాలు లబ్ధి పొందనున్నాయి. గత ఏడాది 1036 సంఘాలకు రూ.105.43 కోట్లు రుణ లక్ష్యం కాగా, 1,236 సంఘాలకు రూ.112.83 కోట్లు మంజూరు చేశారు. ఈ ఏడాది కొత్తగా 29 సంఘాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఖమ్మం నగరపాలకంలో మూడు దివ్యాంగ సంఘాలకు రూ.9 లక్షలు, మధిరలో ఒక సంఘానికి రూ.4 లక్షలు, సత్తుపల్లిలో రెండు సంఘాలకు రూ.6 లక్షలు, వైరాలో ఒక సంఘానికి రూ.3 లక్షలు రుణాలు ఇవ్వనున్నారు.



ఖమ్మంలో ఆరు వీధి వ్యాపారుల సంఘాలకు రూ.16 లక్షలు, సత్తుపల్లిలో 4 సంఘాలకు రూ.14 లక్షలు మంజూరు చేయనున్నారు.

## మతలబేంటి..!

భద్రాచలం : ప్రభుత్వం ప్రకటించే ఉద్యోగ నోటిఫికేషన్లలో గిరిజన నిరుద్యోగులు ఎంపిక కావాలంటే వారు పోటీని ఎదుర్కొనగలగాలి. ఇందుకోసం తగిన శిక్షణ ఉండాలి. ఐటీడీఏ పరిధిలోని గిరిజన యువత కోసం పోటీ పరీక్షలకు శిక్షణ అందించే ఉద్దేశంతో దశాబ్దం క్రితం ఏర్పాటైనదే ప్రి ఎగ్జామినేషన్ ట్రైనింగ్ సెంటర్. భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఇది పనిచేస్తోంది. ఇప్పటివరకు పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై, గ్రూప్స్, అటవీ శాఖ, రెవెన్యూ వంటి నోటిఫికేషన్లకు అనుగుణంగా 3 వేల మందికి తర్ఫీదునిచ్చారు. దాదాపు 100 మంది వివిధ ఉద్యోగాలు సాధించారు. మిగతా ఐటీడీఏలతో పోల్చితే ఇక్కడి కేంద్రం బాగానే పనిచేస్తుందన్న వాదనలు ఉన్నప్పటికీ అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రభ కోల్పోయే ఆస్కారం ఉందన్న ఆందోళన నెలకొంది. తాజాగా 'గ్రూప్-4 శిక్షణ బాధ్యత' విషయంలో తీసుకున్న నిర్ణయం ఇందుకు బలం చేకూరుస్తోంది.

ఐటీడీఏ పరిధిలో గిరిజన యువతకు శిక్షణలను పీఈటీసీ, భవిత నిర్వహిస్తుంటాయి. ఈ రెండు వ్యవస్థలపై పీవో, ఏపీవో జనరల్ పర్యవేక్షణ ఉంటుంది. డీడీ పరిధిలోని పీఈటీసీలో పది మంది విధులు పనిచేస్తున్నారు. గిరిజన విద్యాశాఖ పరిధిలోని వీరంతా రెగ్యులర్ ఉద్యోగులే. భర్తీ కాని పోస్టులను పూర్తి అదనపు బాధ్యతలతోను, డిప్యుటేషన్లతో కొనసాగిస్తున్నారు. నిధులను పారదర్శకంగా వెచ్చించి పోటీ పరీక్షార్థులకు నిపుణులతో ఉచిత బోధన అందించటంతోపాటు, భోజనం, వసతి, స్టడీ మెటీరియల్‌ను సమకూర్చటం పీఈటీసీ విధి. తేడా వస్తే ప్రభుత్వ సిబ్బంది కావడంతో కఠిన చర్యలు తీసుకోవచ్చు.




ప్రభుత్వ సంబంధమైన నోటిఫికేషన్లు విడుదలైనప్పుడు ఈ కేంద్రమే శిక్షణ బాధ్యతలు చేపడుతుంది. ఇందుకు భిన్నంగా తాజాగా గ్రూప్-4 శిక్షణ బాధ్యతను వైటీసీకి అప్పగించారు.

అధికారులు ఏమంటున్నారంటే..

పీవో గౌతమ్ ఆదేశాలతో భవితకు గ్రూప్-4 ఎంపిక శిక్షణ బాధ్యతలు అప్పగించామని ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్ తెలిపారు. ప్రి ఎగ్జామినేషన్ ట్రైనింగ్ కేంద్రంలోని ఉద్యోగులకు ఇతర బాధ్యతలు ఉండడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇదే విషయమై డీడీ రమాదేవి, పీఈటీసీ ప్రిన్సిపల్ రమణయ్య మాట్లాడుతూ ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు భవిత నుంచి శిక్షణ అమలవుతోందని అన్నారు.

రూ.50 లక్షలతో..ఐటీడీఏలో మరో కీలక విభాగం భవిత (వైటీసీ). ఇందులో రెగ్యులర్ ఉద్యోగులకు బాధ్యతలు తక్కువ. ఇది జిల్లా జాబ్స్ మేనేజర్ పర్యవేక్షణలో ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వైటీసీలో శిక్షణ ఇస్తుంటారు. ప్రధానంగా ప్రయివేటు రంగంలో ఉపాధి పొందేందుకు అవసరమైన నైపుణ్యాలను ఇక్కడ నేర్పిస్తారు. ప్రభుత్వ నోటిఫికేషన్లకు సంబంధించిన అడపాదడపా శిక్షణ ఇస్తుంటారు. పీఈటీసీకి పనిఒత్తిడి ఉన్న నేపథ్యంలోనే వీరికి ఈ బాధ్యత అప్పగిస్తారు. తాజాగా పని ఒత్తిడి లేకున్నా భవితకు గ్రూప్-4 శిక్షణ బాధ్యతలు అప్పగించారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ నెల 1న ప్రారంభమైన శిక్షణ 60 రోజులు ఉంటుంది. ఇందుకు రూ.50 లక్షలకు పైగా వెచ్చిస్తారు.

## పల్లె ముంగిట.. ప్రభుత్వ వైద్య సేవలు!

డోర్నకల్ : రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలను చేరువ చేసేందుకు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు గ్రామాల్లో గల ఉపకేంద్రాల్లోని ఖాళీలను భర్తీ చేసింది. 139 ఆరోగ్య ఉపకేంద్రాలను పల్లె దవాఖానాలను ఉన్నతీకరించింది. ఇటీవల చేపట్టిన వైద్యుల నియామకంతో పల్లె దవాఖానాల ద్వారా ప్రభుత్వ వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ అయ్యాయి. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 70 మంది వైద్యులు బాధ్యతలు చేపట్టి పల్లె దవాఖానాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. దంతాలపల్లి, నర్సింహులపేట ఉమ్మడి మండలాల పరిధిలోని పీహెచ్‌సీలో ఇద్దరు, గున్నేపల్లి, దాట్ల, పెద్దముప్పారం, కుమ్మరికుంట్ల, వంతడపల, పెద్దనాగారం, ముంగిమడుగు పల్లె దవాఖానాల్లో వైద్యులు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఒప్పంద ప్రాతిపదికను పని చేసిన వైద్యులు ప్రస్తుతం శాశ్వతస్థాయిలో అధికారులుగా బాధ్యతలు స్వీకరించారు. దంతాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు వివిధ పల్లె దవాఖానాల్లో బాధ్యతలు చేపట్టిన వైద్యాధికారులను పలకరించగా వారు 'న్యూస్‌టుడే'తో తమ మనోగతాలను ఇలా పంచుకున్నారు.

ఉత్తమ ఆసుపత్రిగా గుర్తింపు తెస్తా

- బి.స్పందన, నకిరేకల్

మాది నల్గొండ జిల్లా నకిరేకల్. ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఏడాదికాలం ఒప్పంద ప్రాతిపదికన మెట్‌పల్లి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తించాను. ప్రభుత్వం చేపట్టిన నియామకాల్లో శాశ్వత అధికారిగా దంతాలపల్లి పీహెచ్‌సీకి ఆసుపత్రి వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించాను. ఆసుపత్రి పరిధిలోని దంతాలపల్లి, నర్సింహులపేట ఉమ్మడి మండలాల ప్రజలకు సత్వర ప్రభుత్వ వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తాను. ఉత్తమ ఆసుపత్రిగా పేరు తీసుకొస్తాను.

సొంతూరిలోనే బాధ్యతలు- చైతన్య, దంతాలపల్లి

మాది దంతాలపల్లి గ్రామం. నేను పుట్టి పెరిగిన ఊరు. ఆదిలాబాద్‌లోని రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఒప్పంద విధానంలో మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని ద్వారక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేశాను. ఇటీవల రెగ్యులర్ వైద్యాధికారిగా ఎంపికయ్యాను. పుట్టి పెరిగిన గ్రామంలోనే తాజాగా ప్రభుత్వ వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టినందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత చేరువ చేస్తా.

అదనపు సమయం కేటాయిస్తా- చందు, పెద్దముప్పారం, దంతాలపల్లి మండలం

మాది దంతాలపల్లి మండలం పెద్దముప్పారం. బీఏఎంఎస్ పూర్తి చేశాను. హనుమకొండ, హైదరాబాద్‌లోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో పని చేశాను. నూతన నియామకాల్లో దంతాలపల్లి పీహెచ్‌సీ పరిధిలోని వంతడపల పల్లె దవాఖానా వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించాను. ప్రజలకు వైద్య సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నాను. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పని చేస్తాను. ప్రసవాల సంఖ్య పెంచుతూ ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలకు నమ్మకం కలిగేలా సేవలు అందిస్తాను.

మెరుగైన సేవలు అందిస్తా అనూష, వరంగల్

బీఏఎంఎస్ పూర్తి చేశాక వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేశాను. ఇటీవల భర్తీ చేసిన వైద్యాధికారుల నియామకాల్లో గున్నేపల్లిలోని ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రం వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టాను. గ్రామీణ ప్రాంత ప్రజల ఇబ్బందులపై అవగాహన కలిగి ఉంది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం.

# ఉచిత బియ్యం.. 2.35 లక్షల మందికి ప్రయోజనం

పరిగి : పేద కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు చేపడుతున్నాయి. ఈ కోవలో ప్రారంభించిందే ప్రజా పంపిణీ వ్యవస్థ. దీనికింద ప్రభుత్వం అందజేస్తున్న బియ్యం కోసం ప్రతినెలా ఎదురు చూస్తున్న కుటుంబాలు లక్షల్లో ఉంటున్నాయి. కరోనా కారణంగా కేంద్రం, రాష్ట్రం ఉచితంగా బియ్యం పంపిణీ చేశాయి. కరోనా అనంతరం మధ్య మధ్య కొన్ని అవాంతరాలు ఏర్పడ్డాయి. తాజాగా మళ్లీ ఆరు నెలల పాటు ఉచితంగా బియ్యం పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లాలోని నిరుపేద ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. దీనికి సంబంధించి 'న్యూస్‌టుడే' కథనం.

మంత్రి ప్రకటనతో ఊరట

కరోనా పేద, రోజుకూలీ, మధ్య తరగతి జీవితాలను అతలాకుతలం చేసింది. వీరందరినీ ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం గరీబ్ కల్యాణ్ యోజన పేరిట 5 కిలోల బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేసింది. దాదాపు రెండేళ్ల తరువాత పరిస్థితులు సాధారణ స్థితికి రావడంతో ఈ పథకం మార్చి నెలతో ఆగిపోయింది. ఏప్రిల్, మే నెలలో ఇవ్వలేదు. ఈ కారణంగా ఈఏడాది జూన్ నుంచి నవంబరు వరకు కేంద్రం నుంచి రాష్ట్రం రూపాయికి ఇచ్చే ఆరు కిలోల బియ్యంతో కేంద్ర 5



కిలోల బియ్యాన్ని ఇవ్వాలని నిర్ణయించినట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ గురువారం ప్రకటించారు. దీంతో నిరుపేదల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ఇది పేదలకు ఊరటనిచ్చే విషయం.

ప్రతి నెల 1 నుంచి 15 వరకు...

జిల్లా అచ్చంగా వ్యవసాయాధారిత ప్రాంతం కావడంతో సరకుల కోసం ప్రతినెలా వేచి చూస్తుంటారు. తాండూరు, పరిగి, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలోని 19 గ్రామీణ మండలాల్లో 588 రేషన్ దుకాణాలున్నాయి. ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఆయా దుకాణాల పరిధిలో 2,34,940 రేషన్ కార్డులున్నాయి. వీటిలో ఆహార భద్రత కార్డులు 2,08,168లు, అంత్యోదయ కార్డులు 26,728, అన్నపూర్ణ కార్డులు 36 ఉన్నాయి. వీరందరికీ ఆరు నెలల పాటు ఉచిత బియ్యం లబ్ధి చేకూరనుంది.


జిల్లాలో కరోనా ప్రభావం తీవ్రంగా ఉన్న రోజుల్లో రేషన్ బియ్యం పంపిణీని చరవాణికి వచ్చే ఓటీపీ ద్వారా నిర్వహించేవారు. కరోనా ప్రభావం తగ్గటంతో ఈ పద్ధతిని పక్కన పెట్టి తిరిగి రేషన్ దుకాణాల్లో వేలిముద్రతో సరకులు పంపిణీ చేసే విధానం అమల్లోకి తెచ్చారు. జిల్లాలో మార్చి నెల నుంచి దీనిని అమలు చేస్తున్నారు. ఐరిస్ విధానంతో సరకులు తీసుకునేందుకు అవకాశం ఇచ్చిన పౌర సరఫరాల శాఖ రానురాను స్వస్తి పలకనుందని అధికారులు పేర్కొంటున్నారు. ఓటీపీ విధానంతో అక్రమాలు జరగటానికి ఆస్కారం ఉందని భావించిన ప్రభుత్వం తిరిగి వేలిముద్ర విధానాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం ఓటీపీ విధానం లేకపోవడంతో పంపిణీ మళ్లీ సవ్యంగానే సాగుతోంది. దీంతో పేదలకూ భారం తగ్గింది.

కొనసాగింపు సంతోషకరం : – సత్యమ్మ, కూలి, పరిగి

కరవు కాలంలో ఉచిత బియ్యం ఇవ్వడం సంతోషంగా ఉంది. ఉచిత బియ్యం కొనసాగింపు అందరికీ ప్రయోజనకరం. ముందుముందు కూడా అందించాలి. ఇదే సమయంలో ప్రభుత్వం రాయితీపై అన్ని రకాల సరకులను సరఫరా చేస్తే బాగుంటుంది.

# నిమ్స్‌లో సౌకర్యాలకు హెచ్ఏఎల్, టాటా ట్రస్టు వితరణ

హైదరాబాద్: నిమ్స్‌లో మౌలిక వసతుల కల్పనకు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్), టాటా ట్రస్టు సంస్థలు ముందుకు వచ్చాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద దాదాపు రూ.8 కోట్లతో ఈ సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా కొత్తగా తీర్చిదిద్దిన వార్డులను హెచ్ఏఎల్ డైరెక్టర్ అలోక్‌వర్మ, టాటా ట్రస్ట్



డైరెక్టర్ శ్రీనివాస్, నిమ్స్ డైరెక్టర్ మనోహర్ ఇతర వైద్యులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. భవిష్యత్తులో ఎక్స్‌ట్రా కార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్(ఎక్మో), కంటిన్యూస్ రీనల్‌మెంట్ థెరఫీ(సీఆర్ఆర్‌టీ), టెలి మెడిసిన్ సేవలు అందించేలా మౌలిక వసతులు కల్పించారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ మనోహర్ మాట్లాడుతూ అనస్థీషియా, ఇంటెన్సివ్ కేర్ విభాగంలో కొత్త పరికరాలతో సేవలు మరింత మెరుగుపడతాయన్నారు. హెచ్ఏఎల్ డైరెక్టర్ అలోక్ వర్మ మాట్లాడుతూ సీఎస్ఆర్‌తో సమాజానికి ఉపయోగపడే పనులు చేయవచ్చన్నారు. టాటా ట్రస్టు డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు వర్గాలకు మేలు చేసేందుకు తమ ట్రస్టు ముందుంటుందని చెప్పారు.

# మన బడి.. బాగుపడేదెప్పుడో మరి !



హైదరాబాద్ : "మన ఊరు.. మన బడి.. కింద తొలి విడతలో చేపట్టిన పనులను పాఠశాలలు ప్రారంభించేలోగా పూర్తి చేయాలి. మరమ్మతులు, ఇతరత్రా పనులను జూన్ 13 నాటికి ముగించాలి." – మంత్రులు, ప్రభుత్వం పదేపదే ఇచ్చిన ఆదేశాలివి. మన ఊరు/బస్తీ.. మన బడి పథకం కింద మొదటి విడతలో ఎంపిక చేసిన పాఠశాలల్లో చేపట్టిన పనులు ఇంకా పూర్తి కాలేదు. నిధులు లేకపోవడం.. పనుల నిర్వహణలో జాప్యం వల్ల మరమ్మతులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నెల 13 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. వాటిల్లో చిన్న మరమ్మతులకు రూ.15–16 లక్షల చొప్పున కేటాయించారు. ఈ నిధులతో ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్తు పనులు, తాగునీటి ట్యాంకుల ఏర్పాటు సహా 12 రకాల పనులు చేపట్టాలి. తొలి విడతగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయి. నెల రోజుల కిందట శంకుస్థాపన చేసినా.. ఓ కొలిక్కి రాలేదు. కూకట్‌పల్లి, బాలానగర్ మండలాల్లో 64 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మొదటి విడతలో 21 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారు. కూకట్‌పల్లి మండలంలో ఎంపిక చేసిన 12 పాఠశాలల్లో 55 పనులకు రూ.2.23 కోట్లు, బాలానగర్ మండలంలోని 9 పాఠశాలల్లో 47 పనులకు రూ.64 లక్షలు మంజూరు చేశారు. కేవలం హస్మత్‌పేట ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలో మాత్రమే 2 రోజుల కిందట విద్యుత్తు వైరింగ్ పనులు మొదలయ్యాయి.

ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడో!

పాఠశాలలు ప్రారంభించిన తర్వాత పనులు కొనసాగించాలంటే ఇబ్బందే. అదనపు తరగతి గదులు నిర్మించాల్సిన పాఠశాలల్లో ఎక్కడా పనులు ప్రారంభం కాలేదు. ఇరుకు గదుల్లోనే విద్యార్థులు పాఠాలు వినక తప్పదు. నగరంలో నాలుగు పాఠశాలల్లో గత డిసెంబరులోనే పైలెట్ ప్రాజెక్టు కింద పనులు చేపట్టారు. వీటిల్లోనూ 70 శాతం పనులే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు.

ముందస్తు ఖర్చులతో జాప్యం

పనులకు పాఠశాల యాజమాన్య కమిటీలు ఆమోదం తీసుకుని ప్రారంభించాల్సి రావడం వల్లే తీవ్ర జాప్యమవుతోంది. తర్వాత పనులు చేపట్టి బిల్లులు, నిర్దేశిత పని ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. ఏఈ, డీఈ స్థాయి అధికారులు వచ్చి పరిశీలించి ఆమోదిస్తేనే నిధులు మంజూరవుతాయి. నిధులు ముందుగా ఖర్చు చేయాల్సి రావడం, అడ్వాన్సు కింద పైసా ఇవ్వకుండా పనులు చేపట్టాలంటే తమవల్ల కాదని గుత్తేదారులు ఆసక్తి చూపడం లేదని టీచర్లు చెబుతున్నారు. బిల్లులు అప్‌లోడ్ చేసినా.. నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోందని చెబుతున్నారు.

లిమేడ్చల్ జిల్లా దూలపల్లి ప్రాథమిక పాఠశాలలో 180 మంది చదువుకుంటున్నారు. రూ.15.50 లక్షలతో పనులు ప్రతిపాదించారు. ఆరు మరుగుదొడ్లు ఉండగా మరో రెండు నిర్మిస్తున్నారు. పనులు సగం కూడా చేయలేదు. కొత్త బెంచీలు, రంగులు వేయలేదు.

లి ముషీరాబాద్ ప్రభుత్వ ప్రా.పాఠశాలలో పనులకు నెల కిందట మంత్రి తలసాని శ్రీకారం చుట్టారు. ప్రహరీ, విద్యుత్తు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం సహా మరమ్మతులు చేపట్టాలి. నేటికి పది శాతం పనులే పూర్తయ్యాయి. ప్రహరీ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి.

మొదటి విడత మూడు జిల్లాల్లో ఎంపిక చేసిన పాఠశాలల సంఖ్య..

హైదరాబాద్: 239

రంగారెడ్డి: 464

మేడ్చల్–మల్కాజిగిరి 176

# కడతారా... కలగానే మిగులుస్తారా..



తాండూరు : ఇల్లులేని పేదలకు రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మండలాల వారిగా నిర్మాణాల సంఖ్యను ప్రకటించింది. ఐదేళ్లు దాటినా అనేకచోట్ల కొలిక్కి రావడంలేదు. అసలు కొన్నిచోట్ల పునాదులే దాటలేదు. ఎప్పుడు పూర్తవుతాయోనని దరఖాస్తుదారులుకు ఎదురుచూపులే మిగులుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న స్థితిగతులపై పరిశీలనాత్మక కథనం.

పెరిగిన వ్యయం.. ముందుకురాని గుత్తేదారులు

జిల్లాలో పరిగి, కొడంగల్, వికారాబాద్, తాండూరు నియోజక వర్గాల్లో పరిధిలోని పేదలకు రెండుపడక గదులు నిర్మించేందుకు 2016 సంవత్సరంలో శ్రీకారం చుట్టారు. అప్పట్లో ధరలు అనుకూలంగా ఉండటంతో గుత్తేదారులు ఉత్సాహం చూపారు. కాలం గడిచేకొద్దీ మార్కెట్లో భారీగా పెరిగిన ఇసుక, ఇనుము, సిమెంటు ధరలతో ముందుకు రావడంలేదని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో నిర్ణీత వేళకు నిర్మాణాలు పూర్తయ్యే వాతావరణం కనిపించడంలేదు. దీనికితోడు బిల్లు చెల్లింపులు బకాయిల కారణంగా పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి.

పురపాలక సంఘానికి బాధ్యతలు అప్పగించినా..

వికారాబాద్ జిల్లా కేంద్రంలో 2017లో రామయ్యగూడ వెళ్లే దారిలో 156 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారు. మూడు సంవత్సరాల పాటు ఎలాంటి పనీ చేయలేదు. దీంతో పంచాయతీరాజ్‌శాఖకు కేటాయించిన బాధ్యతలను పురపాలక సంఘానికి అప్పగించారు. గత సంవత్సరం ఫ్లింత్ బీమ్‌లను వేసి వదిలేశారు. నాలుగు బ్లాక్‌లలో గుంతలు తవ్వి వదిలేశారు. ఎన్నోసార్లు నిర్మాణ పనులు చేపట్టాలని గుత్తేదారుపై ఒత్తిడి తెచ్చామని కమిషనర్ శరత్‌చంద్ర తెలిపారు.

మండలాల్లో పునాదులు పడని దైన్యంతాండూరు – హైదరాబాద్ రహదారి వారగా 1000 ఇళ్ల నిర్మాణాలు 2016–17లో ప్రారంభించారు. కరణ్‌కోట, జినగుర్తి ఇలా అనేక చోట్ల ఏళ్లు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్మాణాల ఊసెత్తడం లేదు.

పరిగికి సమీపంలోని విద్యారణ్యపురిలో రూ.15 కోట్ల వ్యయంతో 300 గృహాలను నిర్మించతలపెట్టారు. 120 ఇళ్లు నేటికీ బేసిమెంటు స్థాయిలోనే ఉన్నాయి. దోమ మండలంలో 50ఇళ్లకు 48కి శ్లాబ్ పనులు పూర్తిచేశారు. పూడూరు మండల కేంద్రంలో రూ.2.5కోట్లతో 50 ఇల్లు మంజూరు కాగా ఇక్కడ ప్రాథమిక దశలోనే ఉన్నాయి. కుల్కచర్ల మండలంలో రూ.4కోట్ల వ్యయంతో 80 ఇళ్లను నిర్మించతలపెట్టారు. ఇందుకోసం కనీసం 30గుంటల ప్రభుత్వ స్థలం అవసరం ఉంది.

జిల్లా వ్యాప్తంగా నిర్మాణాలు: 4100

అంచనా వ్యయం: ఒక్కో ఇంటికి రూ.5.4 లక్షలు

ఎలా ఉన్నాయి: స్తంభాలు, శ్లాబ్‌లు, గోడల దశ ప్రస్తుతం: నత్తనడక

కొడంగల్‌లో రెండుసార్లు ప్రారంభం

కొడంగల్ నియోజకవర్గ 5 సంవత్సరాల క్రితం అప్పటి మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం శిలాఫలకం వేసినా అడుగు ముందుకు పడలేదు. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి గెలిచిన తరువాత ఇళ్ల నిర్మాణం మరోసారి ప్రారంభించారు. ప్రస్తుతం పిల్లర్లు సాగుతున్నాయి. మున్సిపల్ పరిధిలోని గాంధీనగర్ కాలనీ పక్కన పొలంలో 150 ఇళ్లకు పనులు చేస్తున్నారు. మరో 150 ఇళ్లకు మిషన్ భగీరథ సంప్ వద్ద ఉన్న స్థలంలో నిర్మాణం చేసేందుకు యోచిస్తున్నారు.

త్వరగా పూర్తిచేస్తాం: మహేష్, జెఈఈ, ఆర్‌అండ్‌బి, పరిగి

రెండు పడక గదుల ఇళ్లను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు చేపడుతున్నాం. పరిగి, దోమ మండలాల్లో కొద్ది రోజుల్లోనే పూర్తవుతాయి. గుత్తేదారులు మరింత చొరవ చూపాల్సిన అవసరం ఉంది. బిల్లులు రావాల్సి ఉంది : వెంకట్రావ్, డీఈ, పంచాయతీరాజ్ శాఖ, తాండూరురెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. బిల్లు బకాయిల కారణంగా పనులు ఈమధ్యే స్తంభించాయి. త్వరలో బిల్లులు విడుదల కాగానే వేగంగా కొనసాగింపజేస్తాం. ఉన్నతాధికారులు ఆదేశాల ప్రకారం నిర్మాణాలపై ముందుకెళ్తాం.

# ఐటీ కారిడార్.. నీటికి బేజార్

హైదరాబాద్: ఇది ఈ నెల 3న గచ్చిబౌలికి చెందిన ఓ అపార్ట్‌మెంట్ వాసులు జలమండలి నుంచి ట్యాంకర్ బుక్ చేసుకున్న సమాచారం. వారికి (10వ తేదీ) సాయంత్రానికి కూడా సరఫరా ఇవ్వలేదు. అదేమంటే గత నెల 26వ తేదీన బుక్ చేసిన వారికి ప్రస్తుతం పంపుతున్నామని సిబ్బంది చెబుతున్నారు. నీటి ట్యాంకర్ నమోదు చేసుకున్న 24 గంటల్లోనే సరఫరా చేస్తామని జలమండలి చెబుతున్నా పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. వారం, పది రోజులైనా పత్తా ఉండటం లేదని ఐటీ కారిడార్‌లోని పలు అపార్ట్‌మెంట్ల వాసులు వాపోతున్నారు.

లి మాదాపూర్, గచ్చిబౌలి, జనార్దన్‌నగర్, సిద్దికీనగర్, టెలికం కాలనీ, ఇంద్రానగర్ తదితర ప్రాంతాల్లో 80 శాతం బోర్లు మార్చిలోనే అడుగంటాయి. బయోడైవర్సిటీ పార్కులో ఆరు బోర్లకు ఒక్కటీ పనిచేయడం లేదు. జలమండలి సరఫరా చేసే నీరే ప్రస్తుతం వీరికి ఆధారం.

లి ఐటీ కారిడార్‌లో నీటి ట్యాంకర్లకు నెలకొన్న డిమాండ్‌కు ఈ రెండు సంఘటనలు ఉదాహరణలు మాత్రమే. ఈ ప్రాంతంలోని వందలాది అపార్ట్‌మెంట్లకు గతంలో మంజీరా నీరు సరఫరా అయ్యేది. ప్రస్తుతం కృష్ణా, గోదావరి జలాలను అందిస్తున్నారు. జనాభాకు తగినట్లు నీటి సరఫరా ఉండక కొరత తలెత్తుతోంది. సాఫ్ట్‌వేర్ సంస్థలు పునఃప్రారంభించడంతో..గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్‌లతోపాటు పరిసరాల్లో పెద్ద ఎత్తున ఐటీ కంపెనీలు విస్తరించాయి. గత రెండేళ్లుగా ఐటీ సిబ్బంది ఇళ్ల నుంచే సేవలందించారు. ప్రస్తుతం కంపెనీలన్నీ తెరుచుకున్నాయి. నీటి అవసరాలు పెరిగాయి. జలమండలి సరఫరా చేస్తున్న నీళ్లు సరిపోక ట్యాంకర్లు బుక్ చేస్తున్నారు. ఒక్కసారి బుక్ చేస్తే మళ్లీ 48 గంటల వరకు రెండోది బుక్ కాకపోవడం, సరఫరాకు వారం నుంచి పది రోజులకు పైగానే పడుతుండడంతో నీళ్లకు అల్లాడుతున్న ప్రజలు ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు.

నల్ల బజారులో విక్రయంఐటీ కారిడార్‌లో జలమండలి సిబ్బంది రెండు చేతులా ఆర్జిస్తున్నారు. గృహావసరాల ట్యాంకరుకు పైడబ్బు రూ.200, వాణిజ్యంకు పైడబ్బు రూ.400 అదనంగా ఇస్తే వెంటనే ట్యాంకరు పంపుతున్నారని, లేదంటే ఆలస్యం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వాణిజ్య విభాగంలో పైడబ్బు ఎక్కువగా వస్తుండడంతో వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. 200 వరకు ఉన్న ఉచిత ట్యాంకర్లు పక్కదారి పడుతున్నాయి. శివార్లలోనూ నీటి ధార వేగంగా రాక చాలామంది ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి నీటి దందాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

# సాగుబడికి సిద్ధం!

వరంగల్ : వానాకాలం సాగు ప్రణాళికను జిల్లా వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. విపణిలో గిరాకీ ఉన్న పంటల వైపు రైతులను మళ్లించేందుకు కార్యాచరణ రూపొందించింది. ఈ ఏడాది ప్రధానంగా పత్తి, కంది సాగు పంటలపై అధికారులు దృష్టి సారించారు. ఎరువుల వినియోగం తగ్గించేలా అవగాహన కల్పించేందుకు క్లస్టర్ల వారీగా ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వ్యవసాయ విస్తరణాధికారులతో పాటు మండల, డివిజన్ స్థాయి అధికారులకు లక్ష్యాలు నిర్దేశించారు. నకిలీ విత్తనాలు అడ్డుకునేందుకు టాస్క్‌ఫోర్సు కమిటీలను సమాయత్తం చేస్తున్నారు.

ఐదెకరాల పంటలపైనే దృష్టి

జిల్లా సాధారణ సాగు 3.50 లక్షల ఎకరాలు కాగా వానాకాలం 3.40 లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశముందని అంచనా వేశారు. ఇందులో వరి 1,31,817 ఎకరాల్లో వరి సాగవుతుందని భావిస్తున్న అధికారులు 60 శాతం సన్న రకం వేసేలా రైతులను చైతన్యపరచాలని



నిర్ణయించారు. విపణిలో పత్తి, కంది, మిరప ధరలు బాగుండటంతో వీటి సాగు విస్తీర్ణం పెరగొచ్చని అధికారులు భావిస్తున్నారు.

కావాల్సిన మేరకు..

ప్రభుత్వం విత్తనాలపై రాయితీ రద్దు చేయడంతో వరి, పత్తి, కంది, మిరప వంటి విత్తనాలకు ప్రైవేటు కంపెనీపైనే ఆధారపడాల్సి వస్తోంది. సాగు విస్తీర్ణం మేరకు కంపెనీలు ఏయే విత్తన రకాలు నిల్వ చేసుకున్నాయనే సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

క్లస్టర్ల వారీగా ప్రదర్శన క్షేత్రాలు

జిల్లాలో అవసరానికి మించి ఎరువులు వినియోగిస్తున్నట్లు తేలింది. ఇక్కడి భూముల్లో భాస్వరం ఎక్కువగా, పొటాష్, జింక్, బోరాన్ తదితర సూక్ష్మపోషకాలు తక్కువగా ఉన్నట్లు జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం తాజాగా గుర్తించింది. ఈ నేపథ్యంలో క్లస్టర్ల వారీగా ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ ఆదేశాలు జారీ చేసింది. భాస్వరం తగ్గించడం వరిసాగులో వెదజల్లే పద్ధతి, పచ్చిరొట్ట వినియోగం, యూరియా విడతల వారీగా వేయడంపై ఒక్కో క్లస్టర్‌లో 50 మంది రైతులకు చెందిన వంద ఎకరాల్లో ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. ఒక్కో ఏఈవో వారంలో నాలుగు ప్రదర్శన క్షేత్రాల్లో అవగాహన కల్పించాలని నిర్దేశించారు. ఏవో, డీఏవోలు పాల్గొనాలని ఆదేశించారు. ఈ మేరకు ప్రత్యేకంగా యాప్‌ను సిద్ధం చేశారు.

సదస్సులతో అవగాహనఉష, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

వానాకాలం సాగుపై రైతు వేదికల్లో రైతులకు అవగాహన కలిగిస్తున్నాం. జిల్లాలో వానాకాలం పంటల సాగుకు ప్రణాళిక రూపొందించి ప్రభుత్వ ఆమోదానికి పంపించాం. మొదటిసారి క్లస్టర్ల వారీగా ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నాం.

# అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

వర్ధన్నపేట : వర్ధన్నపేటలో ఉన్న విద్యుత్తు, రిజిస్ట్రార్, ఎక్సైజ్, ట్రెజరీ తదితర ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వందలాది మంది ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. ఈ కార్యాల యాలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో నిర్వహిస్తు న్నారు. అరకొర వసతులతో సిబ్బంది, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భవనం లేక పోవడంతో వర్ధన్నపేట బస్టాండ్ పక్కనున్న ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నారు. ట్రెజరీ కార్యాలయం.. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని పాత ప్రభుత్వ పాఠశాల భవనంలో కొనసాగుతోంది. ఈ భవనంలో రెండుగదులు ఉండగా మరుగుదొడ్లు లేవు. వర్షం వచ్చినప్పుడు భవనం కురుస్తుంది. వర్ధన్నపేట, ఖిలావరంగల్, పరకాల, నర్సంపేట ఎక్సైజ్ కార్యాలయాలకు ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. రెండేళ్ల క్రితం భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాగా.. పనులు ప్రారంభించారు. నిధులు వెనక్కివెళ్లడంతో గుత్తేదారులు పనులను మధ్యలోనే నిలిపివేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి



ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు రాలేదు: తహసీల్దార్ నాగరాజు, వర్ధన్నపేట

వర్ధన్నపేట పరిధిలో కొన్ని కార్యాలయాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తు న్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ప్రతిపాదనలు అందలేదు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనానికి సంబంధించిన ప్రతిపాదనలు రాగా.. స్థల పరిశీలన చేస్తున్నాం. ఆయా శాఖలు స్థలాలు కావాలని కోరితే అందుబాటులో ఉన్న స్థలాలను పరిశీలించి కేటాయిస్తాం.

నిధులు వెనక్కిపోయాయి: అరుణ, సబ్ రిజిస్ట్రార్, వర్ధన్నపేట

వర్ధన్నపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి గతంలో ప్రతిపాదనలు కోరడంతో పంపించాం. ఉన్నతాధికారులు మళ్లీ ప్రతిపాదనలు అడిగితే పంపిస్తాం. గతంలో మంజూరైన నిధులు కొన్ని కారణాలతో వెనక్కిపోయినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం: పవన్‌కుమార్, ఎక్సైజ్ సీఐ, వర్ధన్నపేట ఎంపీడీవో కార్యాలయ సమీపంలో రెండేళ్ల క్రితం వర్ధన్నపేట ఎక్సైజ్ కార్యాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. గుత్తేదారుకు డబ్బుల చెల్లింపులు నిలిచిపోవడంతో పనులు జరగడం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం.

# సీఎం వైఎస్ జగన్ విశాఖ పర్యటన..షెడ్యూల్ ఇదే..



అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేపు(గురువారం) విశాఖపట్నంలో పర్యటించనున్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో పాల్గొననున్నారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 3.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. అక్కడి నుంచి 3.50 గంటలకు పీఎం పాలెం వైఎస్సార్ స్టేడియంకు చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. సాయంత్రం 4.50 గంటలకు ఆరిలోవ అపోలో ఆస్పత్రికి చేరుకుని, అపోలో కేన్సర్ ఆస్పత్రిని ప్రారంభిస్తారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 5.50 గంటలకు బీచ్ రోడ్డుకు చేరుకుంటారు, అక్కడ వీఎంఆర్డీఏ అభివృద్ధి చేసిన సీ హారియర్ యుద్ధ విమాన మ్యూజియంను ప్రారంభిస్తారు. దీంతోపాటు అక్కడి నుంచే రామ్‌నగర్‌లోని వీఎంఆర్డీఏ కాంప్లెక్స్, ఎంవీపీలోని ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను ప్రారంభించనున్నారు. అనంతరం ఎండాడలోని కాపు భవనం, భీమిలిలోని ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్నారు. అక్కడి నుంచి 6.15 గంటలకు బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్లో జరుగుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబురావు కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొంటారు, అనంతరం రాత్రి 7 గంటలకు తిరుగు ప్రయాణమై 8.20 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

# విజయవాడ, శ్రీశైలం కార్యక్రమాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం




తాడేపల్లి: విజయవాడ, శ్రీశైలంలో జరిగే శ్రీలక్ష్మీమహాయజ్ఞం, మహాకుంభాభిషేక మహోత్సవాలకు ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని డిప్యూటీ సీఎం, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, వైయస్ఆర్ సీపీ ఎమ్మెల్యే చక్రపాణిరెడ్డి, శ్రీశైలం దేవస్థానం ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, వేదపండితులు ఆహ్వానించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం ఆహ్వానపత్రికలు అందజేశారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 12 నుంచి 17 వరకు ఏపీ ప్రభుత్వం-దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో అష్టోత్తర శతకుండాత్మక (108) చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం నిర్వహించనున్నారు. విజయవాడలో జరగనున్న శ్రీలక్ష్మీ మహాయజ్ఞానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్‌ను డిప్యూటీ సీఎం, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, వేద పండితులు ఆహ్వానించారు. అదే విధంగా శ్రీశైలంలో ఈనెల 25 నుంచి 31 వరకు జరగనున్న మహారుద్ర శతచండీ వేదస్వాహాకార పూర్వక మహాకుంభాభిషేక మహోత్సవానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని డిప్యూటీ సీఎం, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, శ్రీశైల దేవస్థానం ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఈవో లవన్న, వేద పండితులు ఆహ్వానించారు. అనంతరం సీఎం వైయస్ జగన్‌కు తీర్థ ప్రసాదాలు అందజేసి వేదమంత్రాలతో వేదపండితులు ఆశీర్వదించారు.

# వైఎస్ జగన్ మనసున్న ముఖ్యమంత్రి: మంత్రి విడదల రజినీ




విజయవాడ: వైద్య, ఆరోగ్య రంగం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో పనుచేస్తున్నారని వైద్యారోగ్యశాఖ మంత్రి విడుదల రజనీ పేర్కొన్నారు. మెరుగైన సౌకర్యాలు, వైద్య సేవలు కల్పించేందుకు నిత్యం తపిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు గొప్ప సేవలు అందిస్తున్నారని అన్నారు. మరింత మెరుగైన సేవలను అందించాలనే ఉద్ధేశంతోనే రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కోవిడ్ సమయంలో వైద్యులు అందించిన సేవలు వెలకట్టలేనవని ప్రశంసించారు. ఈ మేరకు విజయవాడలో మంత్రి బుధవారం మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యుల సేవలు ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చిపెట్టాయని మంత్రి పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీలో అందించే చికిత్సలను పెంచామని, 3255 వైద్య సేవలను ఆరోగ్యశ్రీలో చేర్చారని, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం దేశంలో ఎక్కడా లేదని అన్నారు. గతంలో ఎన్నడూ జరగనంతగా వైద్యశాఖలో ఉద్యోగాల భర్తీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే 49వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. వైద్యానికి కావాల్సిన బడ్జెట్ పెంచాం, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. 'సీఎం జగన్ మనసున్న ముఖ్యమంత్రి. ముందస్తుగా ఆరోగ్య సమస్యలను గుర్తించడం వల్ల ఆసుపత్రులపై ఒత్తిడి తగ్గుతుంది. మెడికల్ కాలేజీలు తేవాలంటే చాలా ధైర్యం కావాలి. 17 మెడికల్ కాలేజీలు తీసుకొచ్చి జగన్ మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించారు. ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒక మెడికల్ కాలేజీ ఉండాలన్నదే సీఎం ఆశయం. భావితరాలకు మెరుగైన వైద్యం అందించడం కోసం సీఎం ఒక యజ్ఞం చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులు ఇప్పటికే కొంత మేర చెల్లించాం. త్వరలోనే మిగతా వాటిని కూడా చెల్లిస్తాం. నాణ్యమైన వైద్యం అందించే విషయంలో ప్రభుత్వం రాజీ పడదు.' అని మంత్రి పేర్కొన్నారు.

**అపర సంజీవని ఆరోగ్యశ్రీ** : రాష్ట్రంలోని పేద ప్రజులకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం అపర సంజీవనిలా మారిందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. ఆరోగ్యశ్రీ, 104, 108 వాహనాలు తదితర అంశాలపై మంత్రి విడదల రజిని మంగళగిరిలోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ. 3,336 కోట్లు కేటాయించిందని తెలిపారు. గత ప్రభుత్వం కేవలం 1,059 ప్రొసీజర్లకు మాత్రమే ఈ పథకం వర్తింపజేసిందని, తమ ప్రభుత్వం కొత్తగా మరో 2,446 ప్రొసీజర్‌లను చేర్చిందని చెప్పారు. దీంతో ఏకంగా 3,255 ప్రొసీజర్‌లకు వైద్యం ఉచితంగా ప్రజలకు అందుతోందన్నారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం ఏడాదికి రూ.వెయ్యి కోట్ల వరకు మాత్రమే ఖర్చు చేసేదన్నారు. తమ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం రూ.3వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోందన్నారు. అదేవిధంగా ఆరోగ్య ఆసరా కోసం రూ.445 కోట్లు, 108 వాహనాల నిర్వహణకు రూ.187 కోట్లు, 104 వాహనాల నిర్వహణకు రూ.164 కోట్లు, ఈహెచ్ఎస్ కోసం రూ.140 కోట్లు చొప్పున ఖర్చు చేస్తోందని వివరించారు. ఏపీలో 2,061ఆస్పత్రులు, తెలంగాణలో 132, కర్ణాటకలో 49, తమిళనాడులో 22 ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్, అడిషనల్ సీఈవో మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



# చిన్నారులే టార్గెట్ అర్ధరాత్రులు కిడ్నాప్ చేసి..

దిల్లీ: అభం శుభం తెలియని చిన్నారులే అతడి టార్గెట్. పసిపిల్లలని కూడా చూడకుండా వారిని కిడ్నాప్ చేసి, లైంగికదాడికి పాల్పడి, ప్రాణాలు తీసేవాడు. అలా సుమారు 30 మంది చిన్నారులను హత్యచేశాడు. మత్తులో ఓ మానవ మృగం ఈ అమానుషానికి పాల్పడింది. ప్రస్తుతం కోర్టు అతడిని దోషిగా తేల్చగా.. త్వరలో శిక్ష ఖరారు చేయనుంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. 2008లో 18 ఏళ్ల వయస్సులో రవీంద్ర కుమార్ కుటుంబం ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాస్‌గంజ్ నుంచి దిల్లీకి వలస వచ్చింది. అతడి తండ్రి ప్లంబర్. తల్లి ఇళ్లలో పనిచేసేది. దిల్లీ వచ్చిన కొద్ది రోజులకు రవీంద్ర డ్రగ్స్‌కు బానిసయ్యాడు. ఆ తర్వాత అశ్లీల దృశ్యాలు చూడటం అలవాటుగా మారింది. రోజుమొత్తం కూలీగా పనిచేసి, రాత్రి పూట డ్రగ్స్ తీసుకునేవాడు. మురికివాడలో ఉండే అతడు రాత్రి ఎనిమిదింటికే నిద్రపోయేవాడు. అర్ధరాత్రి లేచి చిన్నపిల్లలను వెతుక్కుంటూ దగ్గర్లోని నిర్మాణ ప్రదేశాలు, మురికివాడలకు వెళ్లేవాడు. అలా 40 కిలోమీటర్లు నడిచిన రోజులూ ఉన్నాయి. అలా వెళ్తున్నప్పుడు కనిపించిన చిన్న పిల్లలను మభ్యపెట్టి, నిద్రపోతున్నవారిని నిర్జన ప్రదేశాలకు తీసుకెళ్లేవాడు. తర్వాత వారిని లైంగికంగా హింసించి, హతమార్చేవాడు. ఇలా 2008 నుంచి 2015 మధ్య 30 మంది ఉసురుతీశాడు. మృతులంతా 6-12 ఏళ్ల వయస్సువారే! పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు వేర్వేరు ప్రదేశాలను ఈ ఘోరాలకు ఎంచుకున్నాడు. 2014లో ఆరేళ్ల పాపను ఈ విధంగానే చంపేసి, సెప్టిక్ ట్యాంకులో విసిరేశాడని రవీంద్రపై కేసు నమోదైంది.

దీనిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అతడు ఉంటున్న ప్రాంతంలోని ఫుటేజీలు గమనించారు. కొన్ని రోజులు అతడిపై నిఘా ఉంచారు. ఆ హత్యకు అతడికి సంబంధం ఉందనే ఆధారాలు లభించడంతో దిల్లీలోని సుఖ్‌బీర్ నగర్ ప్రాంతంలో రవీంద్రను అరెస్టు చేశారు. ఈ దారుణాలపై విచారణ జరిపిన దిల్లీలోని కోర్టు మే 9న అతడిని దోషిగా తేల్చింది. రెండువారాల్లో శిక్షను ఖరారు చేయనుంది.



# ఇమ్రాన్ అరెస్టు.. పాక్‌లో జాగ్రత్తగా ఉండండి..!

ఇస్లామాబాద్: ఇప్పటికే ఆర్థిక సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న పాకిస్థాన్.. తాజాగా తీవ్ర రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. మాజీ ప్రధాని, పీటీఐ ఛైర్మన్ ఇమ్రాన్ ఖాన్ అరెస్టుతో ఈ పరిస్థితి తీవ్రమైంది. ఈ అరెస్టును వ్యతిరేకిస్తూ ఇమ్రాన్ మద్దతుదారులు చేస్తోన్న ప్రదర్శనలు, ఆందోళనలతో దేశవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వీటిని గమనించి పలు దేశాలు పాక్‌లో అప్రమత్తంగా ఉండాలంటూ తమ పౌరులను హెచ్చరించాయి. ఈ మేరకు యూఎస్, యూకే, కెనడా అడ్వైజరీలు జారీ చేశాయి. 'ఇస్లామాబాద్‌లో ఆందోళనకారులు, పోలీసులకు మధ్య చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులను మా దౌత్యకార్యాలయం అప్రమత్తంగా గమనిస్తోంది. ముమ్ముందు ఘర్షణలు తీవ్రమయ్యే అవకాశాలున్నట్లు సమాచారం అందుతోంది' అని తన పౌరులకు యూఎస్ ఎంబసీ వెల్లడించింది. అమెరికా పౌరులు అప్రమత్తంగా వ్యవహరించాలని, రద్దీ ప్రదేశాలకు దూరంగా ఉండాలని సూచించింది. అలాగే పాక్‌లో రాజకీయ పరిణామాల నేపథ్యంలో అన్ని సమావేశాలను రద్దు చేసుకున్నట్లు తెలిపింది. అమెరికా పౌరులు ఎక్కడికివెళ్లినా వెంట గుర్తింపు కార్డులను తీసుకెళ్లాలని, స్థానిక యంత్రాంగం సూచనలు పాటించాలని చెప్పింది. యూకే కూడా ఇదే తరహా సూచనలు చేసింది. రాజకీయ ప్రదర్శనలు, రద్దీ ప్రదేశాలు, బహిరంగ సభలకు దూరంగా ఉండాలని వెల్లడించింది. స్థానిక వార్తలను గమనించి నిర్ణయాలు తీసుకోవాలని హెచ్చరించింది. 'పాక్‌లో అనూహ్య పరిస్థితులు తలెత్తాయి. ఈ సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఉగ్రవాదం, ఘర్షణలు, కిడ్నాప్ ముప్పు ఉంది' అని కెనడా తన పౌరులకు అడ్వైజరీ జారీ చేసింది. పాక్‌లో నెలకొన్న ప్రస్తుత పరిస్థితిపై శ్వేతసౌధ ప్రెస్ సెక్రటరీ స్పందించారు. ఒక పార్టీ, అభ్యర్థికి అనుగుణంగా అమెరికా అభిప్రాయం ఉండదని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలనేదే తమ సూత్రమని చెప్పింది.

**4-5రోజులు కస్టడీలో ఇమ్రాన్..!**

అవినీతి కేసులో పలు నాటకీయ పరిణామాల మధ్య ఇమ్రాన్ ఖాన్ అరెస్టయిన సంగతి తెలిసిందే. ఓ కేసుకు సంబంధించి ఇస్లామాబాద్ కోర్టులో విచారణకు హాజరైన ఆయన్ను పారామిలిటరీ రేంజర్లు కోర్టు బయట అదుపులోకి తీసుకున్నారు. తనపై వచ్చిన ఆరోపణలపై సమాధానం ఇచ్చేందుకు రాజధాని నగరంలోని పోలీసు కేంద్రకార్యాలయం సమీపంలో ఉన్న ప్రత్యేక న్యాయస్థానంలో బుధవారం ఇమ్రాన్‌ను హాజరుపర్చనున్నారు. అలాగే ఆయన్ను నాలుగైదు రోజులు దర్యాప్తు సంస్థల కస్టడీకి అప్పగించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.




# ఆదిరెడ్డి అప్పారావు, వాసుకు బెయిల్

అమరావతి: జగజ్జననీ చిట్‌ఫండ్ కేసులో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆయన తనయుడు.. తెదేపా నేత శ్రీనివాస్ (వాసు)కు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రెండు రోజుల క్రితం వాదనలు ముగియగా.. తాజాగా బెయిల్ మంజూరు చేస్తూ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది. జగజ్జననీ చిట్‌ఫండ్ వ్యవహారంలో అప్పారావు, వాసులను ఏపీ సీఐడీ అరెస్ట్ చేసింది. తమకు బెయిల్ మంజూరు చేయాలంటూ వారిద్దరూ హైకోర్టును ఆశ్రయించారు. చిట్ ఫండ్ చట్టం ఈ కేసుకు వర్తించదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. డిపాజిట్‌దారుల ఫిర్యాదు లేకుండానే కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. చందాదారుల సొమ్మును చట్ట విరుద్ధంగా ఇతర అవసరాలకు మళ్లించారని ప్రభుత్వం తరఫున ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపించారు.


**వాదనలు కొనసాగాయిలా..** బెయిలు మంజూరు చేయాలని కోరుతూ జగజ్జననీ సంస్థ ఎండీ ఆదిరెడ్డి అప్పారావు, ఆయన తనయుడు, డైరెక్టర్ ఆదిరెడ్డి శ్రీనివాస్ దాఖలు చేసిన వ్యాజ్యాలపై సోమవారం జరిగిన విచారణలో ఇరువైపు వాదనలు ముగిశాయి. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు దమ్మాలపాటి శ్రీనివాస్, పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. సొమ్ము తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారని ఏ ఒక్క చందాదారుడూ(డిపాజిటర్) ఫిర్యాదు చేయలేదన్నారు. జగజ్జననీ చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై 'డిపాజిటర్ల చట్టం' కింద సీఐడీ నమోదు చేసిన కేసు చెల్లదన్నారు. డిపాజిటర్లకు సొమ్ము తిరిగి చెల్లించడంలో విఫలమైతేనే ఆ చట్టం వర్తిస్తుందన్నారు. చిట్ నిర్వహణలో ఏవైనా లోపాలను చిట్ సహాయ రిజిస్ట్రార్ గుర్తిస్తే.. ఆ విషయాన్ని రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లి సరిదిద్దుకునేందుకు వీలు కల్పించాలన్నారు. ప్రస్తుత కేసులో అందుకు భిన్నంగా కాకినాడ సహాయ రిజిస్ట్రార్ వ్యవహరించారని.. నేరుగా సీఐడీకి ఫిర్యాదు చేశారన్నారు. దీని వెనుక పిటిషనర్లను జైలుకు పంపాలనే దురుద్దేశం ఉందని చెప్పారు. గతంలో నిర్వహించిన తనిఖీలలో సొమ్ము చెల్లింపు తేదీల్లో తేడాలున్నాయని మాత్రమే గుర్తించారన్నారు. చిన్న లోపాలు చోటు చేసుకుంటే అవి చిట్ ఫండ్ చట్ట పరిధిలోకి వస్తాయన్నారు. 'డిపాజిటర్ల చట్టం' వర్తించదన్నారు. గతంలో విచారణ నిమిత్తం అధికారులు పిలిస్తే పిటిషనర్ వెళ్లి సహకరించారన్నారు. అరెస్ట్ విషయంలో తొందరపాటు చర్యలొద్దని హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను సీఐడీ పట్టించుకోలేదన్నారు. పోలీసు కస్టడీకి ఇవ్వాలన్న సీఐడీ అభ్యర్థనను దిగువ కోర్టు తోసిపుచ్చిందని తెలిపారు. రికార్డులన్నీ ఇప్పటికే చిట్ రిజిస్ట్రార్ల వద్ద ఉన్నాయన్నారు. దర్యాప్తు పేరుచెప్పి పిటిషనర్లను జైల్లో ఉంచాల్సిన అవసరం లేదన్నారు. ఐపీసీ సెక్షన్ 409, డిపాజిటర్ల చట్టం సెక్షన్ 5 ఈ కేసుకు వర్తించవన్నారు. బెయిలు మంజూరు చేయాలని కోరారు. సీఐడీ తరఫున ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపించారు. దర్యాప్తు కొనసాగుతోందని.. బెయిలు ఇవ్వొద్దని కోరారు. చందాదారుల సొమ్మును చట్ట విరుద్ధంగా ఇతర అవసరాలకు మళ్లించారన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. సొమ్ము తిరిగి చెల్లింపుపై ఏ ఒక్క చందాదారుడికీ అభ్యంతరం లేనప్పుడు డిపాజిటర్ల చట్టం ఏవిధంగా వర్తిస్తుందని ప్రశ్నించారు. ఏజీ బదులిస్తూ.. చందాదారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రెగ్యులేట్ చేసే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు.. నేడు ఆదిరెడ్డి అప్పారావు, వాసుకు బెయిల్ మంజూరు చేసింది.

# నారా లోకేష్ వద్ద తమ సమస్యలను మొరపెట్టుకున్న ముస్లిం మైనారిటీలు



కర్నూలు : నేడు టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ముస్లిం మైనారిటీలు కలిసి తమ సమస్యలను మొర పెట్టుకున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. మైనారిటీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన దుల్హన్ పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. పేద ముస్లింలు ఉన్నత విద్యను అభ్యసించ లేకపోతున్నారని.. వారికి ఆర్థిక చేయూతనివ్వాలన్నారు. మైనారిటీల సంక్షేమానికి కేటాయించిన నిధులను వైసీపీ ప్రభుత్వం స్వాహా చేస్తోందన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన రోషిణి, దుకాన్-మకాన్ పథకాలు నేడు రావడం లేదన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక మైనారిటీలపై వేధింపులు అధికమయ్యాయని తెలిపారు. ముస్లింలకు కేజీ టు పీజీ వరకు మైనారిటీ విద్యార్థులకు ఉచిత విద్యనందించాలన్నారు. పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతో హజ్ యాత్రకు పంపించాలన్నారు. మీరు అధికారంలోకి వచ్చాక మైనారిటీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తేవాలని ముస్లిం మైనారిటీలు కోరారు. ముస్లిం మైనారిటీల సమస్యలపై లోకేష్ స్పందిస్తూ... "జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఏ వర్గమూ ప్రశాంత జీవనం గడిపే పరిస్థితులు లేవు. తాలిబన్ తరహా పాలన కొనసాగిస్తూ మైనారిటీలకు నరకం చూపిస్తున్నారు. తాజాగా మదనపల్లిలో మైనారిటీ యువకుడు అక్రమ్ ను పులివెందుల బ్యాచ్ అన్యాయంగా పొట్టనబెట్టుకుంది. వైసీపీ నాయకులు వేధింపులు తాళలేక అబ్దుల్ సలాం కుటుంబం, మిస్బ ఆత్మహత్య చేసుకున్నారు. మసీదు ఆస్తుల రక్షణ కోసం పోరాడిన ఇబ్రహీంను నర్సరావుపేటలో దారుణంగా నరికిచంపారు. మైనారిటీల సబ్ ప్లాన్ నిధులు రూ.5,400 కోట్ల దారిమళ్లించి ముస్లింలకు అన్యాయం చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గతంలో అమలుచేసిన పథకాలన్నీ పునరుద్దరిస్తాం. పూర్తి ప్రభుత్వ ఖర్చులపై పేద ముస్లింలను హజ్ యాత్రకు పంపే ఏర్పాట్లు చేస్తాం" అని పేర్కొన్నారు.


# తొమ్మిదేళ్లైన కృష్ణానది యాజమాన్య బోర్డును తరలించకపోవడం దురదృష్టకరం



అమరావతి: తొమ్మిది సంవత్సరాలైనా కృష్ణా నది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని తెలంగాణ నుంచి ఏపీకి తరలించకపోవడం దురదృష్టకరమని మాజీ రాజ్యసభ సభ్యులు, ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్. తులసి రెడ్డి వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ కార్యాలయాన్ని రాయలసీమలో కాకుండా విజయవాడలో పెట్టాలని టీడీపీ , విశాఖలో పెట్టాలని వైసీపీ పార్టీ బోర్డుకు లేఖలు రాయడం శోచనీయమన్నారు. ఈ రోజు హైదరాబాద్‌లోని జలసౌధలో కృష్ణా నది యాజమాన్య బోర్డు 17వ సమావేశం జరుగుతోందని తెలిపారు. ఈ సమావేశంలో అయినా బోర్డు కార్యాలయాన్ని హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు తరలించే నిర్ణయాన్ని తీసుకోవాల్సిందిగా కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. జగనన్నకు చెబుదాం ఒక దండగమారి కార్యక్రమమని విరుచుకుపడ్డారు. "స్పందనకు డూప్లికేటే జగనన్నకు చెబుదాం. స్పందనకే స్పందన లేదు. మరి జగనన్నకు చెబుదాం ఎందుకో?" అని విమర్శలు గుప్పించారు. ఇప్పటి వరకు చెప్పిన వాటికే దిక్కు లేదు. మళ్లీ చెప్పి ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. జగన్‌ను దించుదాం అనే ఖచ్చితమైన నిర్ణయానికి ప్రజలు ఇప్పటికే వచ్చారని.... ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రయోజనం లేదని తులసిరెడ్డి వ్యాఖ్యలు చేశారు.

## చిన్న గౌనులో ఉప్పెన పాప.. ఎన్నాళ్ళకెన్నాళ్లకు

ఉప్పెన సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన అందాల భామ కృతి శెట్టి. ఈ అమ్మడు మొదటి సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో వెంటనే నాగ చైతన్యకి జోడీగా బంగార్రాజు సినిమాలో ఈ బ్యూటీ ఆడిపాడింది. ఈ మూవీ కూడా హిట్ కావడంతో వరుసగా అవకాశాలు వచ్చాయి. దీంతో రామ్ కి జోడీగా ది వారియర్ నితిన్ కి జోడీగా మాచర్ల నియోజకవర్గం సినిమాలలో నటించింది. ఈ రెండు సినిమాలు డిజాస్టర్ అయ్యాయి. అలాగే సుదీర్ బాబుకి జోడీగా



నటించిన ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది. ప్రస్తుతం నాగ చైతన్యతో కస్టడీ అనే సినిమాలో ఈ బ్యూటీ నటిస్తుంది. వెంకట్ ప్రభు దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఇదిలా ఉంటే వరుసగా హ్యాట్రిక్ ఫ్లాప్ సినిమాలు పడేసరికి కృతిశెట్టి సోషల్ మీడియాలో కూడా కొంత వరకు సైలెంట్ అయ్యిందని చెప్పాలి. మరల ఇప్పుడిప్పుడే యాక్టివ్ అవుతుంది. తాజాగా ఈ ఉప్పెన బ్యూటీ ఇన్స్టాగ్రామ్ లో అదిరిపోయే ఫోటోలని షేర్ చేసింది. చిన్న గౌను వేసుకొని ఢిల్లీలో గేట్ వే ఆఫ్ ఇండియా దగ్గర అలా ఆహ్లాదంగా సేదతీరుతుంది. థైస్ అందాలు కనిపించే విధంగా ఈ అమ్మడు ఫోటోలకి ఫోజులు ఇచ్చింది. క్యూట్ లుక్స్ తో కుర్రాళ్ళకి సైగలు చేస్తున్న ఈ చిన్నది స్వేచ్ఛగా ప్రకృతిని ఆశ్వాదిస్తూ ఆనందపరవశంలో తేలియాడుతుంది. దీనికి హ్యాపీ సండే అంటూ కృతి పాప క్యాప్షన్ పెట్టింది. దీనిని బట్టి ఈ అమ్మడు ఆదివారం అలా ఢిల్లీలో గేట్ వే ఆఫ్ ఇండియా దగ్గర ఎంజాయ్ చేసినట్లు తెలుస్తుంది. మొత్తానికి సినిమాలు ఆశించిన స్థాయిలో లేకపోయిన కృతి శెట్టి మాత్రం సరదాగా దొరికిన టైమ్ ని ఎంజాయ్ చేస్తుందని ఈ ఫోటోల బట్టి తెలుస్తుంది. ఇదిలా ఉంటే కస్టడీ పూర్తయిన తర్వాతనే నెక్స్ట్ సినిమా ఏదైనా కమిట్ అవ్వాలని కృతి శెట్టి ఆలోచిస్తున్నట్లుగా టాక్ వినిపిస్తుంది. కస్టడీలో ఈమె ఇంటరెస్టింగ్ రోల్ లో కనిపించబోతుంది. దీని తర్వాత సూర్యకి జోడీగా ఒక తమిళ్ సినిమాకి కూడా కృతి శెట్టి కమిట్ అయినట్లు తెలుస్తుంది.

## రితికా సింగ్ పై రుస రుసలు!

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో సినిమా ప్రెస్ మీట్ల తంతు గురించి చెప్పాల్సిన పనిలేదు. పీఆర్ ఓ ఇచ్చిన టైమ్ కి ప్రెస్ మీట్ మొదలు కాదు...పూర్తి కాదు. దీంతో మీడియా మొత్తం గంటల తరబడి వెయిట్ చేయాల్సిందే. అందులోనూ అగ్ర హీరోల సినిమాల సంగతైతే చెప్పాల్సిన పనిలేదు. కొంత మంది హీరోల ఈవెంట్లు తప్ప! చాలా వరకూ ఒక ప్రెస్ మీట్ పూర్తవ్వడానికి ఓ పూట పడుతుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్లు..ఆడియో వేడుకలు.. టీజర్ లాంచ్ లు..ట్రైలర్ లాంచ్ లు సమయం పట్టడం సహజమే. కానీ కొన్ని సందర్భాల్లో సాధారణ ప్రెస్ మీట్ కి కూడా గంటలు సమయం పడుతుంది. దీనిపై ఎప్పటికప్పుడు మీడియా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేసిన



సందర్భాలు చాలానే ఉన్నాయి. ఓసారి నాని సినిమా విషయంలో మీడియా కాస్త సీరియస్ గానే వ్యవహరించింది. ప్రెస్ మీట్ కి బాగా ఆలస్యంగా రావడంతో ఆ హీరో ప్రెస్ మీట్లు బ్యాన్ చేస్తున్నట్లు ప్రకటించడం జరిగింది. ఆ తర్వాత హీరో నాని క్షమాపణలు చెప్పడంతో వివాదం కొద్ది రోజులకి సద్దుమణిగింది. తాజాగా నటి రితికా సింగ్ హీరోయిన్ గా నటించిన ఇన్ కార్ ప్రెస్ మీట్ లోనూ దాదాపు అలాంటి సన్నివేశమే చోటు చేసుకుంది. రితికా సింగ్ చెప్పిన సమయానికి మీడియా సమావేశానికి అటెండ్ కావడంలో విఫలమైంది. దీంతో మీడియా ప్రతినిధులు ఆమెపై ఫైర్ అయ్యారు. మీడియా సమావేశానికి మూడు గంటలు ఆలస్యంగా వస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో ఆమె కాస్త కంగారు పడింది. ఎప్పుడు లేనింది సీన్ ఇలా రివర్స్ అయింది ఏంటని ఆందోళనకి గురైంది. వెంటనే తాను కావాలని లేటు చేయలేదని మిస్ కమ్యూనికేషన్ కారణంగా ఆలస్యం అయిందని వివరణ ఇచ్చే ప్రయత్నం చేసారు. ఆలస్యం అయినందుకు మీడియా ప్రతినిధులకు క్షమాపణలు చెప్పారు. దీంతో మీడియా సమావేశం ప్రశాంతంగా ముగిసింది. అనంతరం తమ సినిమా సమావేశాలు అనుకున్న టైమ్ లో పూర్తిచేసేలా పీఆర్ ఓలు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలా కుదరకపోతే టీమ్ అంతా అటెండ్ అయిన తర్వాత మీడియాకి పీఆర్ ఓ సమాచారం ఇవ్వాలని కోరారు. మరి మార్పు వస్తుందా? లేదా? అన్నది చూడాలి.




## శ్రీలీల దెబ్బకి బేజారవుతున్న కృతి





టాలీవుడ్లో హీరోలు వాళ్లే ఉంటారు కానీ... హీరోయిన్లు మాత్రం ఎప్పటికప్పుడు మారిపోతూ ఉంటారు. హీరోయిన్ వచ్చి దాదాపు కొన్నేళ్లు అవుతుందంటే.. ఆమె క్రేజ్ తగ్గిపోవడం వంటివి చోటు చేసుకుంటూ ఉంటాయి. అలాంటి సమయంలో సీనియర్ భామల హడావిడి తగ్గిపోతున్న క్రమంలో ఎంట్రీ ఇచ్చిన కృతి శెట్టి మొదటి సినిమాతోనే సూపర్ హిట్ అందుకుంది. ఉప్పెన సినిమాలో బేబమ్మ పాత్రలో నటించిన ఆమె ఆ సినిమాతో సూపర్ క్రేజ్ అందుకోవడంతో ఇక ఆమె ఎక్కడికో వెళ్ళిపోతుందని అందరూ భావించారు. కానీ ఆమె అనుహ్యంగా ఉప్పెన తర్వాత ఒక్క హిట్టు కూడా దక్కలేదు. అయితే ఈ భామకు త్వరలోనే మరిన్ని అవకాశాలు దక్కుతాయని అందరూ భావిస్తున్న తరుణంలో శ్రీలీల ఎంట్రీ ఇచ్చింది. కృతి శెట్టి ఎలా అయితే మంగళూరు నుంచి ఎంట్రీ ఇచ్చిందో... శ్రీలీల కూడా బెంగళూరు నుంచి ఎంట్రీ అయితే తెలుగు నేటివిటీ ఉన్న అమ్మాయి కావడం.. తల్లిదండ్రులు తెలుగువారు కావడంతో శ్రీలీలకు అదనపు బలం తోడైనట్లైంది. ప్రత్యేకంగా తెలుగు నేర్పాల్సిన అవసరం లేకపోవడంతో పాటుగా ఆమె చేస్తున్న సినిమాలన్నీ సూపర్ హిట్లుగా నిలుస్తుందనే పక్షంలో ఆమెకు వరుస అవకాశాలు లభిస్తున్నాయి. దీంతో కృతి శెట్టి రావాల్సిన ఆఫర్లను సైతం ఈ భామ అందుకుంటుంది. అలా వరుస అవకాశాలతో శ్రీ లీల దూసుకుపోతోంది. అలాగే కృతి శెట్టి ప్రతి విషయానికి తన తల్లిని తీసుకురావడం అన్నిట్లో ఆమెదే డామినేషన్ అవడంతో పాటు రెమ్యూనరేషన్ మీద పెట్టిన శ్రద్ధలో కొంత కూడా సినిమా పెర్ఫార్మెన్స్ మీద పెట్టడం లేదని ఆరోపణలు ఉన్నాయి. దర్శక నిర్మాతలకు కాస్త ఇబ్బందికర పరిస్థితులు ఎదురైన క్రమంలోనే ఆమెను ఇప్పుడు పక్కన పెడుతున్నారని తెలుస్తోంది. శ్రీ లీల కమర్షియల్ సినిమాలే చేసినా డాన్స్ పెర్ఫార్మెన్స్ తనదైన క్యూట్నెస్ లుక్స్ తో.. తనదైన నటనతో అందరిని ఆకట్టుకుంటూ వరుస అవకాశాలు దక్కించుకుంటూ ముందుకు వెళుతోంది. ఈ భామ పవన్ కళ్యాణ్ సినిమాతో పాటు పలు క్రేజీ ప్రాజెక్టులు దక్కించుకున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అందులో నిజా నిజాలు ఎంతవరకు ఉన్నాయో తెలియదు. కానీ అవి నిజమైతే మాత్రం టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా నిలబడే అవకాశాలు ఎక్కువగా ఆమెకి ఉన్నాయని చెప్పొచ్చు.

## గ్రాఫిక్స్ తో అనుష్కని మార్చేస్తారట.. ఏంటి నిజమేనా..?







స్వీటీ అనుష్క ఒకప్పుడు వరుస సినిమాలతో తన ఫ్యాన్స్ ని అలరించేది కానీ ఈమధ్య సినిమాలకు చాలా గ్యాప్ ఇచ్చింది. బాహుబలి 2 తర్వాత భాగమతి నిశ్శబ్ధం సినిమాలు మాత్రమే చేసిన అనుష్క ఆఫ్టర్ లాంగ్ గ్యాప్ రీసెంట్ గా నవీన్ పొలిశెట్టి సినిమాకు సైన్ చేసింది. యువి క్రియేషన్స్ బ్యానర్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో అనుష్క చెఫ్ గా కనిపిస్తుంది. ఇక ఈ సినిమా షూటింగ్ దాదాపు ముగింపు దశకు చేరుకోగా మరో సినిమాకు కూడా అనుష్క సైన్ చేసినట్టు తెలుస్తుంది. కోలీవుడ్ డైరెక్టర్ ఏఎల్ విజయ్ డైరెక్షన్ లో అనుష్క సినిమా చేస్తుందని టాక్. రీసెంట్ గా అనుష్క చబ్బీ లుక్స్ మళ్లీ ఫ్యాన్స్ ని కంగారు పెట్టిస్తుంది.

సైజ్ జీరో సినిమా నుంచి అనుష్క తన లుక్స్ విషయంలో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. అనుష్క సినిమాలకు దూరమైన కారణం కూడా అదే అంటూ చెబుతున్న సందర్భాలు ఉన్నాయి. ఆమధ్య తన స్లిమ్ లుక్ ఫోటో షూట్ తో సర్ ప్రైజ్ చేసిన అనుష్క మళ్లీ సైజ్ జీరో సినిమాలానే తయారైందని టాక్. అయితే విజయ్ మాత్రం తన సినిమాలో అనుష్కని గ్రాఫిక్స్ వాడి స్లిమ్ లుక్ లో చూపిస్తానని చెప్పుకుంటున్నారు. బాహుబలి 2 లో కొన్ని సీన్స్ అలా చూపించారు. అంతేకాదు బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ ఆమీర్ ఖాన్ లాల్ సింగ్ చద్దా సినిమాలో కూడా ఆమీర్ ఖాన్ యంగ్ ఏజ్ సీన్స్ ని అలానే స్పెషల్ కెమెరా టెక్నిక్ వాడినట్టు తెలుస్తుంది. ఇప్పుడు అనుష్క సినిమాకు కూడా అదే కెమెరా టెక్నాలజీ యూస్ చేసి ఆమెను సన్నగా చూపిస్తారని టాక్. అయితే అనుష్క ఫ్యాన్స్ మాత్రం ఈ విషయంలో అసంతృప్తిగా ఉన్నారు. అనుష్క తన ఫిజిక్ విషయంలో దృష్టి పెట్టకపోవడం ఫ్యాన్స్ ని నిరుత్సాహపరుస్తుంది.

గ్రాఫిక్స్ ఎంత వాడినా సరే స్క్రీన్ మీద తేలిపోతుంది. మరి అనుష్క ఎందుకిలా చేస్తుంది అంటూ ఫ్యాన్స్ డిజప్పాయింట్ అవుతున్నారు. అయితే అసలు విజయ్ సినిమాలో అనుష్కని టెక్నాలజీ వాడి చూపిస్తారన్నది జస్ట్ బయట వినిపిస్తున్న వార్త మాత్రమే.

అందులో నిజం ఎంత ఉంది అన్నది తెలియాల్సి ఉంది. నవీన్ పొలిశెట్టి సినిమా నుంచి వచ్చిన ఫస్ట్ లుక్ లో కొద్దిగా పర్వాలేదు అనిపించినా రీసెంట్ ఫోటోలలో అనుష్క మళ్లీ సైజ్ జీరో సినిమాలో చబ్బీ లుక్స్ తో కనిపించింది. మరి అనుష్క కెరీర్ ముగించాలని ఫిక్స్ అయ్యే ఇలా చేస్తుందా లేక సన్నబడాలని తను అనుకుంటున్నా తన వల్ల కావట్లేదా అన్నది తెలియాల్సి ఉంది. తన లుక్స్ విషయంలో అభ్యంతరం వల్లే అసలు అమ్మడు ఎక్కడ కనిపించడం కూడా మానేసిందని చెప్పుకుంటున్నారు.

## చిరుతో ఇంటరాక్షన్..శ్రీముఖికి కలిసొచ్చిందా?

శ్రీముఖి అలియాస్ బుల్లి తెర రామలమ్మ క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. చిన్న తెరపై ఎంత కాంపిటీషన్ ఉన్నా రాములమ్మ ప్రత్యేకత మాత్రం వేరు. యాంకర్లందరికంటే సమ్ థింగ్ స్పెషల్ అట్రాక్షన్ అమ్మడి సొంతం. తనలో ఆ రేర్ క్వాలిటీనే మిగతా వాళ్ల నుంచి వేరు చేస్తుంది. సరైనా సినిమా ఛాన్సులు పడలేదు..లేదంటే అక్కడా చిచ్చర పిడుగులా చెలరేగేది. అయినా అంది వచ్చిన ఏ అవకాశాని విడిచిపెట్టడం లేదు. తన లో హాట్ అప్పిరియన్స్ ని సందర్భం చిక్కినప్పుడల్లా ఇన్ స్టా వేదికగా షేర్ చేస్తూనే ఉంటుంది. అలాగే నటిగానూ సత్తా చాటే ప్రయత్నాలు చేస్తుంది. ఇటీవలే నటసింహ బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తోన్న 108వ చిత్రంలో అవకాశం వచ్చిందని ప్రచారం సాగుతోంది. ఇందులో బాలయ్య కుమార్తె గా శ్రీలీల నటిస్తుండగా..ఆమె స్నేహితురాలి పాత్రకు శ్రీముఖి ఎంపికైటనట్లు తెలుస్తోంది. ఆద్యంతం ఆ పాత్ర సైతం ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా అనీల్ రావిపూడి డిజైన్ చేసినట్లు టాక్ వినిపిస్తుంది.



ఈ నేపథ్యంలో తాజాగా అమ్మడు మెగాస్టార్ చిరంజీవి సినిమాలో సైతం ఛాన్స్ అందుకుందని కొత్త ప్రచారం తెరపైకి వస్తుంది. ప్రస్తుతం చిరు కథానాయకుడిగా మోహర్ రమేష్ దర్శకత్వంలో భోళా శంకర్ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కొద్ది భాగం షూటింగ్ కూడా పూర్తయింది. తాజాగా ఈ సినిమాలోనూ శ్రీముఖి ని కీలక పాత్రకు తీసుకున్నట్లు వినిపిస్తుంది. దీంతో శ్రీముఖి ఎంట్రీ వెనుక మెగాస్టార్ ఉన్నట్లు ఇన్ సైడ్ టాక్. చిరు సలహాతోనే శ్రీముఖి తీసుకున్నట్లు సన్నిహితుల నుంచి వినిపిస్తుంది. తొలి నటుల్లో ప్రతిభని గుర్తించి ప్రోత్సహించడంలో చిరు ముందుంటారు.


గాడ్ ఫాదర్ లో సత్యదేవ్ ప్రతి నాయకుడిగా ఛాన్స్ అందుకున్నారంటే దానికి కారణం మెగాస్టార్. సత్యదేవ్ అయితే ఆ పాత్రకు సరిగ్గా సూటవుతాడని భావించి ఎంపిక చేసారు. తాజాగా శ్రీముఖి ఎంట్రీ వెనుక అంతటి బలమైన కారణం ఉందని తెలుస్తుంది. ఆ మధ్య చిరంజీవిని సైతం శ్రీముఖి మాటల తో మెస్మరైజ్ చేసిన సంగతి తెలిసిందే. గాడ్ ఫాదర్ ప్రమోషన్ లో భాగంగా చిరుతో ఇంటరాక్ట్ అయింది. ఆ సమయంలో మెగాస్టార్ పై మాటల్లో చెప్పలేని అభిమానిన్ని కురిపించింది. చిరు సైతం అంతే ఎగ్జైట్ అయ్యారు. ఇలా అన్ని రకాలుగా శ్రీముఖికి కలిసొచ్చిందని ఇన్ సైడ్ వినిపిస్తున్న మాట.

## సమీరా రెడ్డి.. టవల్లో ఇలా జ్ఞానోదయం!

ఉమెన్స్ డే సందర్భంగా మాజీ హీరోయిన్ సమీరా రెడ్డి సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఇన్ స్టాగ్రామ్ లో ఆమె చేసిన వీడియో ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఆ రీల్ చేయడమే కాదు దానికి ఒక క్యాప్షన్ కూడా పెట్టారు. ప్రపంచం నిన్ను చెక్ చేసే వరకు ఆగదు నిన్ను నువ్వే చెకింగ్ చేసుకో అంటూ ఆమె కామెంట్ చేసింది. నిన్ను నువ్వే బాగుపరచుకో నీకు నువ్వే ఇన్వెస్ట్ చేసుకో... నిన్ను నువ్వే ప్రేమించు.. ప్రపంచం నిన్ను చెక్ చేసే వరకు వెయిట్ చేయకు... నిన్ను నువ్వే చెక్ చేసుకో అంటూ ఆమె చేసిన రీల్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది అయితే సమీరా రెడ్డి ఈ రియల్ చేయడానికి ఒంటి మీద ఎలాంటి దుస్తులు లేకుండా కేవలం ఒక టవల్ ధరించి



కనిపిస్తోంది. ఆ టవల్ ధరించి తరువాత టవల్ తీసేసి దుస్తులు ధరిస్తున్నట్లుగా కనిపిస్తోంది. సమీరా రెడ్డి ముంబై లోనే పుట్టి పెరిగింది ఆమె తండ్రి తెలుగు వ్యక్తి కాగా తల్లి మంగళూరుకు చెందిన వ్యక్తి. సినిమాల మీద ఆసక్తితో నేనే దిల్ తుజ్కో దియా అనే హిందీ సినిమా ద్వారా ఆమె హీరోయిన్ గా లాంచ్ అయింది. తరువాత పలు సినిమాలు కూడా చేసింది గాని పెద్దగా గుర్తింపు రాలేదు. తెలుగులో నరసింహ అనే సినిమాతో హీరోయిన్ గా లంచ్ అయిన ఆమె తరువాత జై చిరంజీవ అశోక్ వంటి సినిమాలు మాత్రమే చేసింది. తక్కువ సినిమాలే అయినా ఎన్టీఆర్ ఆమెతో ప్రేమలో ఉన్నాడని ప్రచారం కారణంగా ఆమె తెలుగు వారందరికీ బాగా పరిచయమైంది. అయితే ఆ తర్వాత సమీరారెడ్డి వేరే వ్యక్తిని పెళ్లి చేసుకోవడం ఎన్టీఆర్ కూడా లక్ష్మీ ప్రణతిని పెళ్లి చేసుకోవడం అందరికీ తెలిసిందే. వివాహం జరిగిన తర్వాత పిల్లలు కూడా జన్మించడంతో సమీరా రెడ్డి ఇప్పుడు సోషల్ మీడియా ద్వారా అభిమానులతో టచ్ లో ఉండే ప్రయత్నం చేస్తుంది. అందులో భాగంగానే అనేక రకమైన రీల్స్ చేస్తూ ఆసక్తికరమైన పోస్టులు పెడుతూ సోషల్ మీడియాలో టచ్ లో ఉంటుంది.




# నిర్మల్ ఫస్ట్.. వికారాబాద్ లాస్ట్

హైదరాబాద్: తెలంగాణ టెన్త్ ఫలితాల్లో 86.6 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఫలితాలను రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) ప్రాంగణంలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేశారు. ఫలితాల్లో బాలికలు 88.53 శాతం, బాలురు 84.68 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని మంత్రి తెలిపారు. 99 శాతం ఉత్తీర్ణతతో నిర్మల్ జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా.. 59.46 శాతంతో వికారాబాద్ చివరి స్థానంలో నిలిచినట్లు వివరించారు. 25 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా పాస్ కాలేదని సబిత చెప్పారు.

జూన్ 14 నుంచి 22వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని.. ఈనెల 26లోపు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది మంత్రి వివరించారు.

# ఆంజనేయస్వామి అనుగ్రహంతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి : ఎమ్మెల్సీ కవిత



జగిత్యాల : కొండగట్టు ఆంజనేస్వామి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆకాంక్షించారు. కొండగట్టు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం, అక్కడ నిర్వహించిన హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమంలో కవిత పాల్గొన్నారు. హనుమాన్ చాలీసా పారాయణం ముగిసిన అనంతరం కవిత మాట్లాడారు.

మంచి జీవితాన్ని ప్రసాదించేటటువంటి, ఆనందాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చేటటువంటి, విజయాన్ని అందించే ఆంజనేయ స్వామిని కొలిచినట్టు అయితే ప్రజలందరూ సుభిక్షంగా ఉంటారని మనందరం బలంగా నమ్ముతాం. అందుకే తెలంగాణలోని ప్రతి గ్రామంలో ఆంజనేయస్వామి గుడి ఉంటుంది. కరోనా కష్టసమయంలో తెలంగాణ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలంటే హనుమాన్ పారాయణం చేయాలని కొండగట్టు ఆలయ పూజారి జితేంద్రయ్య సూచించారు. ఆంజనేయ స్వామి పారాయణానికి మించిన మందు లేదు అని ఆయన చెప్పారు. ఆనాటి నుంచి నేటి వరకు కొండగట్టు అంజన్న సేవా సమితి పేరుతో జితేంద్రయ్య నేతృత్వంలో అందరం కూడా పారాయణం చేస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకుంటున్నాం అని ఎమ్మెల్సీ కవిత తెలిపారు.

# బీసీలు వెనుకబడలేదు.. గత పాలకుల నిర్లక్ష్యమే వెనుకబడేసింది: మంత్రి గంగుల



హైదరాబాద్: బీసీలు వెనుకబడ్డ వారు కాదని గత పాలకుల నిర్లక్ష్యంతో వెనుకకు నెట్టేయబడ్డారని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బీసీలతోపాటు యావత్ తెలంగాణ సమాజానికి రాష్ట్రాన్ని సాధించి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎనలేని సేవ చేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్‌గా పల్లె రవికుమార్ గౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు గంగుల కమలాకర్, జగదీశ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. బీసీల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడే ప్రభుత్వం తమదని, కల్యాణ లక్ష్మి రైతుబంధు, రైతుబీమా తదితర పథకాల్లో బీసీలదే మెజార్టీ వాటా అన్నారు. రాష్ట్రంలో కులవృత్తులకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా కేసీఆర్ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. అభివృద్ధి కోసం నీరాకేఫ్‌ను ప్రారంభించడంతోపాటు గౌడబీమాను ప్రకటించారని చెప్పారు. కల్లుగీత వృత్తిదారుల కార్పొరేషన్ చైర్మన్‌గా ఉద్యమకారుడు, బీసీ బిడ్డ అయిన పల్లె రవికుమార్‌కు అవకాశం కల్పించారని చెప్పారు. ఆయన ఆధ్వర్యంలో రాష్ట్రంలోని గౌడ వృత్తిదారులందరికీ సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సీఎం హామీకే దిక్కులేకపోతే రాష్ట్రంలో పాలన ఉన్నట్టా లేనట్టా!



హైదరాబాద్: రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శుల సమ్మెపై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నల్గొండ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. గత 13 రోజుల నుంచి పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేస్తున్నారని.. వీరి సమ్మె వలన గ్రామాల్లో అభివృద్ధి అడుగంటిపోయిందని తెలిపారు. వారి మూడేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ 2022, ఏప్రిల్ 11న పూర్తైందన్నారు. రెగ్యులర్ చేయకపోగా, ప్రొబేషనరీ పీరియడ్‌ను మరో ఏడాది పెంచుతున్నట్లు అసెంబ్లీలో ప్రకటన చేసి, ఆ వెంటనే జూలై 17న జీవో నెంబర్ 26ను విడుదల చేశారన్నారు. అయితే ఇప్పటివరకు ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో దిక్కులేని పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు సమ్మెకు దిగాన్నారు. తక్షణమే వారికిచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకే దిక్కులేకపోతే రాష్ట్రంలో పాలన ఉన్నట్టా లేనట్టా! అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పంచాయితీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

లేనిపక్షంలో వారి పోరాటానికి కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలవడమే కాక... వారి తరపున ప్రత్యక్ష కార్యచరణకు కూడా సిద్ధమవుతామని ఉత్తమ్ లేఖలో డిమాండ్ చేశారు.

**ఉత్తమ్ డిమాండ్లు ఇవే..** జూనియర్ పంచాయితీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలి... 2019 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు వారుచేసిన పనికాలాన్ని సర్వీసుగా పరిగణించాలి..

చనిపోయిన పంచాయితీ కార్యదర్శుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించేలా కారుణ్య నియామకాలు చేపట్టాలి. ఓపీఎస్ వారిని కూడా రెగ్యులర్ చేయాలి. మహిళా పంచాయితీ కార్యదర్శులకు 6 నెలల ప్రసూతి సెలవులు, 90 రోజుల చైల్డ్ కేర్ సెలవులు ఇవ్వాలి.

# జూన్ 14 నుంచి పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు



హైదరాబాద్ : తెలంగాణ పదో తరగతి ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేశారు. ఈ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థుల కోసం జూన్ 14వ తేదీ నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ పరీక్షలు జూన్ 22 వరకు కొనసాగుతాయని తెలిపారు.

ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఫెయిలైన విద్యార్థులు మే 26వ తేదీ లోపు సంబంధిత స్కూల్లో పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

**రీ కౌంటింగ్‌కు అవకాశం :** పది విద్యార్థులకు రీ కౌంటింగ్‌కు అవకాశం కల్పించినట్లు మంత్రి వెల్లడించారు. రీ కౌంటింగ్‌కు రూ. 500ల చొప్పున చెల్లించి మార్కులు మళ్లీ లెక్కించుకోవచ్చు. దీని కోసం ఫలితాలు విడుదలైన పదిహేను రోజుల్లో ఎస్‌బీఐ బ్యాంకులో చలాన్లు చెల్లించి, దాన్ని బోర్డులో సమర్పిస్తే రీ కౌంటింగ్‌కు అవకాశం ఇస్తారు. డీడీలు చెల్లవు అని మంత్రి స్పష్టం చేశారు.




# ప్రవీణ్ మామూలోడు కాదు..

## టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల కేసులో కొత్త లింకులు

హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో కొత్త లింకులు బయటపడుతున్నాయి. హైదరాబాద్ సిట్ పోలీసులు మంగళవారం మరో నలుగురు నిందితుల్ని అరెస్టు చేశారు. నాగర్‌కర్నూల్‌కు చెందిన ఆది సాయిబాబా, మాడావత్ శివకుమార్, నాగార్జునసాగర్ నివాసి రమావత్ మహేశ్, ఖమ్మం జిల్లాకు చెందిన పొన్నం వరుణ్‌లు.. ప్రధాన నిందితుడు ప్రవీణ్‌కుమార్ వద్ద ఏఈ, ఏఈఈ ప్రశ్నపత్రాలు కొనుగోలు చేశారు. ఢాక్యానాయక్ ద్వారా ప్రవీణ్‌కు పరిచయమైన వీరు ఒక్కో ప్రశ్నపత్రం రూ.10 లక్షల చొప్పున ప్రవీణ్‌తో బేరమాడారు. అడ్వాన్సుగా ఒక్కొక్కరు రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు చెల్లించారు. ఫలితాలు వెల్లడయ్యాక మిగతా సొమ్ము ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. వీరితో సంబంధాలున్న మరో 10 మంది కోసం గాలిస్తున్నారు. వీరంతా అడ్డదారిలో ప్రభుత్వ కొలువు సంపాదించేందుకు ప్రశ్నపత్రాలు కొనుగోలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో నిర్ధారించారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల కొనుగోళ్ల కొత్త లింకులు బయటపడుతున్నాయి. మార్చి 13న ఓ యువకుడు ఇచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు లీకేజీ నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసులో 9 మందిని తొలుత బేగంబజార్ పోలీసులు అరెస్టు చేశారు. తర్వాత ఒక్క మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలోనే 15 మందిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు ప్రవీణ్ కుమార్ నివాసంలో స్వాధీనం చేసుకున్న పత్రాలు, సెల్‌ఫోన్ డేటా, బ్యాంకు ఖాతా ఆధారంగా ప్రశ్నపత్రాలు కొనుగోలు చేసిన అభ్యర్థులను గుర్తించి అరెస్టు చేస్తూ వస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాతో మొదలైన లీకేజీ లింకులు హైదరాబాద్, రంగారెడ్డి, నాగర్‌కర్నూలు, ఖమ్మం, నల్గొండ జిల్లాలకు పాకాయి.

**ప్రవీణ్ మామూలోడు కాదు :** టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగానే ప్రవీణ్ ప్రశ్నపత్రాలు కాజేసేందుకు పథకం వేశాడు. కమిషన్‌లో సైబర్ భద్రతాలోపాలను అవకాశంగా మార్చుకున్నాడు. నెట్‌వర్క్ ఇన్‌ఛార్జి రాజశేఖర్‌రెడ్డి సహకారం తీసుకున్నాడు. అతడు కాన్ఫిడెన్షియల్ విభాగం సూపరింటెండెంట్ డైరీ నుంచి యూజర్ ఐడీ/పాస్‌వర్డ్ కాజేసి పోటీ పరీక్షలకు సిద్ధంచేసిన మాస్టర్ ప్రశ్నపతాలను తన పెన్‌డ్రైవ్‌లోకి డౌన్‌లోడ్ చేయించుకున్నాడు. తొలుత గ్రూప్-1 ప్రశ్నపత్రాలను రాజశేఖర్‌రెడ్డి, షమీమ్, సురేష్‌కుమార్‌లకు ఇచ్చాడు. చేతికి అందిన ఏఈ, ఏఈఈ, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీర్, డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్(డీఏఓ) ప్రశ్నపత్రాలను తనకున్న పరిచయాల ద్వారా బేరం కుదుర్చుకొని విక్రయించాడు. వేతనం జమయ్యే బ్యాంకు ఖాతాలో కాకుండా మరో ఖాతాలోకి జమ చేయించుకున్నాడు.

కొందరినుంచి నేరుగా నగదు తీసుకున్నాడు. పోలీసులకు మస్కా కొట్టాలని చూసినా.. సాంకేతిక పరిజ్ఞానం, కాల్‌డేటా, వాట్సాప్ సందేశాల ఆధారంగా ప్రవీణ్ లీలలను వెలికితీస్తున్నారు.



# పోదెం VS రేగా..

## నువ్వెంతంటే నువ్వెంత.. రేగా కాంతారావు వర్సెస్ పోదెం వీరయ్య

పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, భద్రాచలం ఎమ్మెల్యే పోదెం వీరయ్య మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలోని లక్ష్మినగరంలో.. తునికి ఆకుల సేకరణ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అయితే, రేగా కాంతారావు ప్రసంగిస్తూ సీఎం కేసీఆర్‌ను పొగడ్తలతో ముంచెత్తగా.. పోదెం వీరయ్య అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువురు నువ్వెంత అంటే నువ్వెంత అంటూ ఒకరినొకరు దూషించుకున్నారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకొని వివాదాన్ని సద్దుమణిగించారు. కాగా, ఈ వివాదం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఎదుటే జరగటం గమనార్హం.

# కేసీఆర్ కాళ్లు పిసకడం అనుకుంటున్నాడా..

## రేవంత్ రెడ్డిని పిసకడం అంటే..?: తలసానికి రేవంత్ కౌంటర్



హైదరాబాద్ : నిన్న సెక్రటేరియట్ ఎంట్రీ విషయంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యాఖ్యలకు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. పేడ పిసికే అలవాటున్న తలసానికి పిసుకుడు గురించే మాట్లాడుతారన్నారు. పిసుకుడు సంగతి దేవుడెరుగు.. అతను నమిలే పాన్ పరాక్ మానేస్తే బాగుంటుందని రేవంత్ సూచించారు. అరటి పండ్ల బండి దగ్గర మేక నమిలినట్లు పాన్ పరాక్‌లు నమిలే వారు కూడా తన గురించి మాట్లాడితే అంత గౌరవంగా ఉండదన్నారు. ఇంకా రేవంత్ మాట్లాడుతూ.. "ఆయనకు అంతగా కోరిక ఉంటే.. ఏం పిసకాలనుకుంటున్నారో, ఎక్కడకు రావాలో తారీఖు చెబితే వస్తా.. ఎవరేం పిసుకుతారో చూద్దాం. కేసీఆర్ కాళ్లు పిసకడం అనుకుంటున్నాడా.. రేవంత్ రెడ్డిని పిసకడం అంటే..? మంత్రిగా మాట్లాడేటప్పుడు బాధ్యతగా ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి. నేను పీసీసీ అధ్యక్షుడిని. తలసాని జీవితాంతం కేసీఆర్ కాళ్లు పిసికినా నా స్థాయికి రాలేరు" అని పేర్కొన్నారు.

కాగా.. నిన్న తలసాని మాట్లాడుతూ.. కాంగ్రెస్ సభలో ప్రియాంకగాంధీ యూత్ డిక్లరేషన్ ఎందుకు ప్రకటించారో వారికే తెలియాలన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో దేశాన్ని 45-50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీకి.. పేదలకు రూ.2 వేల పింఛన్, 24 గంటల కరెంట్, ఇంటింటికి తాగునీరు ఇవ్వాలనే ఆలోచన ఎందుకు రాలేదని ప్రశ్నించారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిన పాపం కాంగ్రెసదేనని ఆరోపించారు. దేవుళ్ల పేరు చెప్పి రాజకీయ చేయడం తప్ప.. అభివృద్ధి చేశామని ఓట్లడిగే దమ్ము బీజేపీకి లేదని విమర్శించారు. యజ్ఞాలు, యాగాలు చేయడమే కాకుండా.. యాదాద్రి వంటి గొప్ప దేవాలయాన్ని నిర్మించిన కేసీఆర్ కంటే గొప్ప హిందువు దేశంలో ఎవరూ లేరని అన్నారు. "ఓ పొట్టోడు ఎమ్మెల్యేలను, మంత్రులను అందరినీ వాడు, వీడు అని మాట్లాడుతుండు. పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుండు.. పిసికితే పాణం పోతది"" అని పరోక్షంగా రేవంత్‌రెడ్డినుద్దేశించి తలసాని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు భద్రాద్రి సీతారామస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ సిబ్బంది వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అర్చకులు వేదాశీర్వచనాలు ఇచ్చారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com